

ఉష్ణోగ్రత (అంచనా)

9-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	28
తెనాలి	41	28
నరసరావుపేట	39	29
బాపట్ల	39	28
రెంటచింతల	39	28
చీరాల	39	28



డీఈవో కార్యాలయ ఆవరణలో బైఠాయించిన ఉపాధ్యాయులు

వెబ్ ఆప్షన్స్.. వద్దు

- మాన్యువల్‌గా నిర్వహించాలని డిమాండ్
- సెకండరీ గ్రేడ్ టీచర్ల కౌన్సెలింగ్‌పై సంఘాల ఆందోళన
- విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌ను వెబ్ ఆప్షన్స్‌లో నిర్వహిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్‌కు నిరసనగా ఆదివారం గుంటూరులోని డీఈవో కార్యాలయాన్ని ఉపాధ్యాయులు ముట్టడించారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ సంఘాల నాయకులతో జరిపిన చర్చల్లో మాన్యువల్ విధానంలోనే ఎస్‌జీటీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని విద్యాశాఖాధికారులు హామీ ఇచ్చారన్నారు. అయితే వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు ఇచ్చుకోవాలని ఎంఈవోల ద్వారా ఒత్తిడి సరికాదన్నారు. ఒక్కొక్కరు 3 వేలకుపైగా ఆప్షన్స్ పెట్టుకోవడం సాధ్యమయ్యే పనేనా అని ప్రశ్నించారు. ఐక్యవేదిక నాయకులు కళాధర్, పెదబాబు, మక్కెన శ్రీనివాసరావు, జోసెఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ స్వల్పంగా ఉండే స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్‌లో అనేక తప్పులు జరిగాయన్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్ హామీ అమలు చేయకపోతే విద్యాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఐక్యవేదిక నాయకులు రాజశేఖర్, సుబ్బారెడ్డి, మహమ్మద్ ఖాలీద్, నరసింహారావు, సోషలిజం, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రజిత్, మహమ్మద్ ఉస్మాన్, మోహనరావు, రామకృష్ణ, వీరాంజనేయులు, శ్రీనివాసరావు, సాంబయ్య, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన పసుపు రైతులను ఆదుకుంటాం

- మంత్రి అనగాని సత్యప్రసాద్
- మంత్రిని కలిసి తమకు న్యాయం చేయమని వేడుకున్న రైతులు

6

కమిటీలు సరే.. సేవలు?

- కొలువుదీరిన యార్డు పాలక వర్గాలు
- గత వైసీపీ పాలనలో అలంకారప్రాయం..
- ఐదేళ్లు మార్కెట్ యార్డుల లక్ష్యం నిర్వీర్యం
- ఇప్పటికైనా నూతన కమిటీలు చొరవ తీసుకోవాలి
- నిలిచిన సేవలు అమలవుతాయని ఆశిస్తోన్న అన్నదాతలు

రైతుల కోసం.. అన్నదాతల సేవలో.. భూమి పుత్రులను బాగు చేయాలని.. దళారుల దోపిడీ నుంచి గట్టెక్కించాలి.. ఇలా ఎన్నో కార్యక్రమాల బాధ్యత వ్యవసాయ మార్కెట్ కమిటీలది. అయితే గత ఐదేళ్లు పేరుకే పాలక వర్గాల నియామకాలు జరిగాయే కానీ యార్డుల లక్ష్యాలను పూర్తిగా విస్మరించారు. అలంకార ప్రాయంగా మారిన పాలకవర్గాలు రైతుల గురిం చి.. వారి సమస్యల గురించి కనీస ఆలోచనలు చేయలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను చక్కదిద్దే క్రమంలో మార్కెట్ యార్డులకు పూర్వ వైభం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో చాలావరకు మార్కెట్‌యార్డుల పాలక వర్గాల నియామకాలు జరిగాయి. ఈ క్రమంలో ఇప్పటి నుంచైనా ఆయా పాలకవర్గాలు రైతుల సేవలో నిమగ్నమవ్వాల్సిన బాధ్యత ఉంది. రైతుల నుంచి ఆదాయం పిండుకోవడమే కాకుండా వారి బాగోగుల గురించి ఆలోచించాలని పలువురు సూచిస్తున్నారు. కొత్త కమిటీలు కొలువుదీరడంతో నిలిచిపోయిన యార్డుల సేవలు మళ్లీ అమలవుతాయని అన్నదాతలు ఆశిస్తున్నారు.

నరసరావుపేటలో నిలిచిపోయిన శీతల గిడ్డంగి



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మార్కెట్ యార్డుల పాలకవర్గాల నియామకం చాలావరకు ఒక కొలిక్కి వచ్చింది. ఆయా పాలకవర్గాల ప్రమాణ స్వీకారాలు, బాధ్యతల స్వీకరణలు ఇప్పటికే చాలవరకు జరిగాయి. యార్డుల ద్వారా అన్నదాతలకు ఎన్నో రకాల సేవలు గతంలో అందేవి. అయితే ఆ సేవలన్నీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిలిచిపోయాయి. ఏటా రూ.కోట్లలో ఆదాయం యార్డుల ఖాతాల్లో చేరుతున్నా ఆ నిధులను వారి కోసం ఖర్చు చేయడంలేదు. గతంలో రైతుబంధు, లింకురోడ్ల నిర్మాణాలు, వైద్య శిబిరాల నిర్వహణ, గోదాముల నిర్మాణం ఇలా ఎన్నో కార్యక్రమాలు మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో జరిగేవి. అయితే గత వైసీపీ హయాంలో ఇలాంటి కార్యక్రమాల ఊసే లేదు. అన్నదాతలకు అందించాల్సిన పథకాలను కూడా కొన్నేళ్లుగా అమలు చేయడంలేదు. పైగా నిధులు ఏమయ్యాయో అనేది తెలియడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ల కమిటీల పరిధిలో కొత్త పథకాలు అమలు జరగలేదు. ఉన్న పథకాలనే అటకెక్కించి అన్నదాతల ప్రయోజనాలకు గండి కొట్టారు. యార్డుల నుంచి ఏ ఒక్క ప్రయోజనం లేదని రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ-మార్కెటింగ్ (మిగతా 6వ పేజీలో)

ఈఏపీసెట్‌లో.. భళా

- ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగంలో 28, 32 తదితర ర్యాంకులు
- సత్తాచాటిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు
- ఆరో ర్యాంకుతో పాటు ఇంజనీరింగ్‌లో 100 లోపు 20 ర్యాంకులు



తారికశ్రీ ఉమాశంకర్



విక్రమ్‌లేవీ



రేవంత్‌కు స్వీటు తినిపిస్తున్న వెంకటేశ్వరరావు

గుంటూరు(విద్య), నరసరావుపేట టౌన్, రేపల్లె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-2025లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో గుంటూరు నగరానికి చెందిన విక్రమ్‌లేవీ ఇంజనీరింగ్ విభాగంలో ఆరో ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాడు. ఇంజనీరింగ్ విభాగం నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో కె.పార్థసారథి 19, ఎ.నోషిక్‌సాయి 25వ ర్యాంకుతో పాటు 100 లోపు 20 మంది ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగం లో రేపల్లెకు చెందిన వల్లభనేని వెంకటేశ్వరరావు, వాణి దంపతుల కుమారుడు రేవంత్ 48వ ర్యాంకు సాధించాడు. తెలంగాణా ఎంసెట్ ఫలితాల్లో రేవంత్ 43వ ర్యాంకు, జేఈఈ అడ్వాన్స్‌లో 627 ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగంలో తారికశ్రీ ఉమాశంకర్ 28, కారుమంచి విక్రాంత్ 32, షేక్ వసీమా 60, వేముల అవంతి చేతన్ 67, ఎస్ జడ్సన్ ప్రసన్న 95వ ర్యాంకు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం రావిపాడుకు చెందిన ఎన్ రక్షిత ఇన్నా 72వ ర్యాంకు, నరసరావుపేటకు చెందిన ఎస్‌కే నిహాల్‌పర్వేజ్ 74వ ర్యాంకు సాధించారు. ఇక ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఇంజనీరింగ్ విభాగంలో పరీక్షకు 33,013 మంది విద్యార్థులు హాజరుకాగా 23,536 మంది అర్హత సాధించారు. వీరిలో బాలురు 12,747, బాలికలు 10,789 మంది ఉన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షకు 6,680 మంది విద్యార్థులు హాజరు కాగా 6,198 మంది అర్హత సాధించారని ఇంటర్ బోర్డు అధికారులు ప్రకటించారు.

హాస్టళ్లను వీడరంట?

సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ల బది'లీలలు'

- ఖాళీలు చూపకుండా ఇష్టారాజ్యంగా బదిలీలు
- ఉద్యోగ సంఘాల నుంచి సిఫార్సు లేఖల కొనుగోలు
- అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు పలువురు సిద్ధం

గుంటూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా ఒకే చోట ఉంటున్నారు.. విద్యార్థుల సంక్షేమం పట్టదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. అక్రమాలపై ఆరోపణలు వస్తున్నాయి.. బదిలీలతో హాస్టళ్ల ప్రక్షాళన జరుగుతుందని అందరూ అనుకున్నారు.. కానీ అలా జరగలేదు. సిఫార్సు లేఖలు కొనుగోలు చేసి కొందరు.. ముడుపులు ఇచ్చి కొందరు.. ఫోకల్ పాయింట్లు చూపి మరి కొందరు.. బదిలీల నుంచి తప్పించుకుంటున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని సాంఘీక సంక్షేమ శాఖ వెల్ఫేర్ ఆఫీసర్ల బదిలీల్లో భారీ అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల స్థాయిల్లో 70 మందికిపైగా వెల్ఫేర్ ఆఫీసర్లు ఉన్నారు. నిబంధనల ప్రకారం మూడేళ్లు దాటిన వారిని బదిలీ చేయాలి. అయితే కొందరు దీర్ఘకాలికంగా ఒకే చోట పని చేసేందుకు (మిగతా 6వ పేజీలో)



సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

తొలిరోజే.. 10 వేల టిక్కీలకుపైగా

- ఆదివారం సాయంత్రం నుంచే ప్రారంభమైన ఎరైవల్స్
- నేటి ఉదయం 7 గంటల నుంచి కొనుగోళ్లకు వ్యాపారులు సిద్ధం

గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం ఆదివారం సాయంత్రం మిర్చియార్డు గేట్లు తెరుచుకున్నాయి. రైతులు తమ వద్ద నిల్వ ఉన్న టిక్కీలను ఆటోలు, ట్రాక్టర్లు, లారీల్లో తీసుకురావడం ప్రారంభించారు. యార్డు ప్రాంగణమంతా ఖాళీగా ఉండటంతో వాహనాలను కమీషన్ ఏజంట్ల దుకాణాల వద్ద దిగుమతి చేశారు. తొలి రోజే నాన్ ఏసీ వెరైటీ మిర్చి టిక్కీలు 10 వేలకుపైగా వచ్చాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచి వేలం ప్రారంభమైన తర్వాత కొనుగోళ్లకు వ్యాపారులు సిద్ధమయ్యారు. కొత్త సరుకు ఇప్పుడల్లా వచ్చే పరిస్థితి లేని దృష్ట్యా కచ్చితంగా ధర పెరిగేందుకు ఆస్కారం ఉన్నట్లు రైతులు అంచనా వేస్తున్నారు. చిలకలూరిపేట వైపు నుంచి వచ్చే వాహనాలు ప్రధాన ముఖద్వారం, సత్తెనపల్లి, నరసరావుపేట, తాడికొండ, ప్రత్తిపాడు ప్రాంతాల నుంచి వచ్చేవి నల్లపాడు రోడ్డులోని గేట్ల ద్వారా లోపలికి అనుమతించారు. గ్రామాల నుంచి ఆదివారం సాయంత్రం, రాత్రి బయలుదేరిన వాహనాలు సోమ వారం వేకువజామున వచ్చే అవకాశం ఉందని సిబ్బంది చెబుతున్నారు.



యార్డుకు వాహనాల్లో మిర్చి టిక్కీలను తీసుకొస్తున్న రైతులు

జగన్ మీడియాపై మహిళల ఆగ్రహం

- అమరావతిని వేశ్యల రాజధానిగా సంబోధించటంపై అట్టుడుకుతున్న మహిళా లోకం
- జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేనిలను వెంటనే అరెస్టు చేయాలి
- లేదంటే మరోసారి అమరావతి ఉద్యమం తప్పదు

6

అక్టోబరులో చేనేత సంఘం రాష్ట్ర మహాసభలు

రాజకీయ సంకల్పంతోనే పోలీస్ సంస్కరణలు సాధ్యం

- విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

మాజీ మేయర్ కావటిపై వైసీపీ వేటు

- మరో ఇద్దరు కార్పొరేటర్లపై కూడా చర్యలు
- సస్పెండ్ చేస్తూ కేంద్ర కార్యాలయం ఆదేశాలు
- మేయర్ పదవికి ముందే రాజీనామాపై ఆగ్రహం



గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నగర మాజీ మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కార్పొరేటర్లు మర్రి అంజలి, యాట్ల రవికుమార్‌లపై వైసీపీ అధిష్ఠానం సస్పెన్షన్ చేసింది. ఈ మేరకు వైసీపీ అధినేత జగన్ ఆదేశాల మేరకు వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు కేంద్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవితో పాటు పలు పదవులు నిర్వహించిన కావటి వైసీపీ ఆవిర్భావం తర్వాత జగన్ వెంట నడిచారు. 2019 ఎన్నికల సమయంలో పెదకూరపాడు పరిశీలకుడిగా ఉన్న ఆయనకు అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు నగరపాలక సంస్థ మేయర్‌గా అవకాశం ఇచ్చారు. గత ఎన్నికల్లోనూ మేయర్ హోదాలో ఉండ గానే చిలకలూరిపేట నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. పలువురు కార్పొరేటర్లు చేరికలతో పాటు అధికారంలోకి రావడంతో మేయర్ పీఠంపై కన్నేసిన కూటమి నేతలు కావటిపై అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. అవిశ్వాసానికి ముందే మనోహర్ తన పదవికి రాజీనామా చేశారు. అవిశ్వాసంలో కూటమి ఓటమి చెందేదని, తమ ఆదేశాలు లేకుండా ముందే పదవికి కావటి రాజీనామాపై అధిష్ఠానం పెద్దలను ఆగ్రహానికి గురిచేసినట్లు సమాచారం. అంతేగాక ఇటీవల కావటి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. దాంతో కావటితో పాటు ఇద్దరు కార్పొరేటర్లపై వేటు వేయడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

హుందాగానే రాజీనామా

కార్పొరేటర్లు వలసలపై పార్టీ ముఖ్య నేతలెవరూ పట్టించుకోలేదని, పదవి కాపాడుకోవడం కష్టమని గుర్తించే తాను హుందాగా రాజీనామా చేసినట్లు నేతలకు అప్పట్లోనే కావటి వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మేయర్‌గా తనకు అధికార వర్గాల నుంచి గౌరవం లేకుండా పోయిందని ఈ పరిస్థితుల్లో పదవిలో ఉండటం సమంజసం కాదని రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు ఆనాడే మీడియా ఎదుట కూడా చెప్పారు.







సంద్రం.. సందడి



సూర్యలంక సముద్రతీరంలో పోటెత్తిన ప్రజానీకం

సూర్యలంకకు పోటెత్తిన ముస్లింలు

బాపట్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరం ఆదివారం జనసంద్రంగా మారింది. సముద్ర స్నానాలు, ఇసుకలో చిన్నారులు ఆటలతో సందడి చేశారు. శనివారం బక్రీద్ ప్రార్థనలు చేసుకుని ఆదివారం సముద్రస్నానాలకు పెద్ద సంఖ్యలో ముస్లింలు కుటుంబాలతో తరలివచ్చారు. ఉద యం నుంచి సాయంత్రం వర కు వారు తీరంలో సరదాగా గడిపారు. పొగురు వైపు నుంచి ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ వరకు పర్యాటకులతో నిండిపోయింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కమిటీలు సరే.. సేవలు?

(5వ పేజీ తరువాయి)

విధానాన్ని తీసుకువచ్చి ఆన్‌లైన్‌లో కొనుగోళ్ల జరపాలని నిర్ణయం తీసుకుంది. అయితే ఈ విధానం కూడా పక్కాగా అమలు కాలేదు. ప్రతి మార్కెటింగ్ కమిటీ కొనుగోలు కేంద్రంగా మారాలని ప్రతిపాదించారు. కానీ ఎక్కడా ఉత్పత్తులను కొనుగోలు లేదు. ఈ పరిస్థితుల్లో నూతన పాలకవర్గాలు ఆయా సేవలను తిరిగి అందించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అటకెక్కిన రైతుబంధు..

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మద్దతు ధర లేని పక్షంలో వాటిని యార్డులు కుదవ పెట్టుకుని రుణాలు ఇచ్చేందుకు గతంలో రైతుబంధు పథకం అమలు చేశారు. అయితే ఈ పథకాన్ని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఈ పథకంలో పంట దిగుబడులను నిల్వ చేసుకుని ఆ విలువలో 80 శాతం వరకు రుణంగా ఇచ్చే వారు. ధర వచ్చాక అయా ఉత్పత్తులను విక్రయించి రుణాలను తిరిగి తీర్చుకునే వెసులుబాటును కమిటీలు కల్పించేవి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 24 యార్డుల పరిధిలో లక్షల మంది ఉన్నా ఒక్క రైతుకు కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం అందలేదు. దీంతో ఉత్పత్తులను ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని దోపిడీకి గురవుతున్నారు.

రోడ్ల నిర్మాణాన్ని విస్మరించారు

వ్యవసాయ ఉత్పత్తులను కల్లాలకు, ఇళ్లకు తరలించుకునేందుకు వీలుగా పొలాలకు లింకు రోడ్లను మార్కెటింగ్ కమిటీలు నిర్మించాలి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కో కమిటీ పరిధిలో 30 శాతం నిధులు ఇందుకు కేటాయించేవి. గత ఐదేళ్లలో ఒక్క రహదారి కూడా వేయలేదు. అసలు వారి కోసం ప్రతిపాదనలు కూడా లేవు.

వైద్య శిబిరాలు లేవాయె

రైతులు ప్రత్యామ్నాయ ఆర్థిక వనరుగా ఉండే పాడి సంపద అభివృద్ధికి కూడా మార్కెట్ కమిటీలు పెద్ద పీట వేసేవి. ఏడాదికి నాలుగు పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేవి. గత ఐదేళ్ల పశు వైద్య శిబిరాల నిర్వహణ ఊసే మరిచారు.

నిలిచిన గోదాముల నిర్మాణం

వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు గోదాములు, శీత ల గిడ్డంగులు నిర్మించాలి. ఐదేళ్ల లో ఒక్కటి కూడా నిర్మించలేదు. దీని వల్ల ఆదాయం కోల్పోవడమే కాకుండా రైతులు వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

ధరల దోపిడీ..

మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయల ధరలను ప్రతి రోజు కమిటీలు ప్రకటించాలి. రైతుకు ఇవ్వాల్సిన ధరను అమలయ్యేలా కృషి చేయాలి. కనీసం ధరల పట్టికను కూడా యార్డులు నిర్వహించడం లేదని రైతులు వాపోతున్నారు. దీని వల్ల తాము దోపిడీకి గురౌతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

జగన్ మీడియాపై మహిళల ఆగ్రహం

- అమరావతిని వేశ్యల రాజధానిగా సంబోధించటంపై అట్టుడుకుతున్న మహిళా లోకం
- జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేనిని అరెస్టు చేయాలి
- లేదంటే మరోసారి అమరావతి ఉద్యమం తప్పదు

తుళ్లూరు, జూన్ 8, (ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అని సాక్షి ఛానల్ లైవ్ డిబేట్‌లో సంబోధించిన జర్నలిస్టు కృష్ణంరాజు, దానిని సమర్థించిన కొమ్మినేని శ్రీనివాస్‌ను అరెస్టు చేయకపోవటంపై రాజధాని మహిళల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం చర్యలు తీసుకోవటంలో ఎందుకు అలసత్వం వహిస్తుందని మహిళలు మండిపడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని కాదని సెక్స్‌వర్కర్ల రాజధాని అని పబ్లిక్‌గా సాక్షి ఛానల్‌లో మాట్లాడితే భారతి రెడ్డి మహిళ అయి ఉండి కూడా ఖండించటం లేదంటే.. అమరావతిపై బురద జల్లే కార్యక్రమం జగన్ అండ్ కో మరలా ప్రారంభించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల పోలీస్ స్టేషన్‌లో కృష్ణం రాజు, కొమ్మినేని శ్రీనివాస్ పై ఇప్పటికే మహిళలు ఫిర్యాదులు చేశారు. దీనిపై అమరావతి రైతు జేఏసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. సాక్షి ఛానల్ మూయించాలని.. లేదంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపింది.



డైవర్ట్ పాలిటిక్స్ కోసం..

రాజధాని అమరావతి మహిళలపై సాక్షి ఛానల్‌లో వచ్చిన అసభ్యకర వ్యాఖ్యలు డైవర్ట్ పాలిటిక్స్ కోసం చేస్తున్నారు. దేశంలోనే అతి పెద్ద మద్యం స్కాం నుంచి ప్రజల దృష్టిని మరల్చటానికి జగన్ రెడ్డి చేస్తున్న ఆకృత్యం ఇది. . రాజధాని మహిళలకు భారతి రెడ్డి క్షమాపణ చెప్పాలి. యావత్తు మహిళా లోకాన్ని కించపరిచారు.

-కొమ్మినేని వరలక్ష్మి, రాజధాని మహిళ



విషం కక్కే వారిని వదలం

జగన్మోహన్‌రెడ్డికి అధికారం పోయినా అమరావతి రాజధానిపై విషం చిమ్ముతున్నాడు. ఇప్పుడు మహిళా లోకంతో పెట్టుకున్నాడు. ఈ 11సీట్లు కూడా లేకుండా చేసి జగన్‌రెడ్డి అడ్రస్ గల్లంతు చేస్తాం. కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఫోక్సో కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి.

అంకం సువర్ణ కమల.. రాజధాని దళిత మహిళా జేఏసీ కన్వీనర్



వారి నాలుక కోయాలి

మహిళలపై జుగుప్సాకరంగా మాట్లాడిన వారి నాలుక కోయాలి. వారికి అమ్మలు. అక్కలు, చెల్లెలు, భార్యలు లేరా. అమరావతి ఉద్యమం సమయంలో మహిళలను అగౌరపరిచారు. ఎన్నికల్లో అడ్రస్ లేకుండా ప్రజలు తీర్పు ఇచ్చారు. అయినా బుద్ది రావటం లేదు. చట్టపరంగా కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

గడ్డం మాధవి - అమరావతి మహిళ



ఎప్పటికీ దేవతల రాజధానే..

అమరావతి చరిత్ర తెలియని బుద్ధిహీనులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. జర్నలిస్టులని వెంటనే అరెస్టు చేయాలి. విచారణ పేరుతో కాలయాపన చేయకుండా ఫాస్ట్ ట్రాక్ కోర్టులో శిక్షపడేలా చర్యలు తీసుకోవాలి. అమరావతి మహిళలను కించపరిచిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. లేదంటే ఉద్యమం తప్పదు.

పొదిలి ప్రసన్న, అమరావతి మహిళ

మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

సత్తెనపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అమరావతి వేశ్యల రాజధాని అని, మహిళలపై, రాజధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలి స్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్‌పై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సత్తెనపల్లికి చెందిన మహిళా నేతలు ఆదివారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజను కలసి ఫిర్యాదు చేశారు. మహిళా కమిషన్ తరుపున సుమోటోగా కేసు నమోదు చేస్తామని శైలజ తెలిపినట్టు టీడీపీ మహిళా రాష్ట్ర కార్యదర్శి మన్నవ శారదా దేవి తెలిపారు. వారిద్దరికీ నోటీసులు జారీ చేస్తున్నామని, ఇలాంటి వ్యాఖ్యలు ఎవ్వరూ చేయకుండా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పినట్టు శారదాదేవి తెలిపారు.



రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజకు ఫిర్యాదు చేస్తున్న సత్తెనపల్లి మహిళలు

నష్టపోయిన పసుపు రైతులను ఆదుకుంటాం

మంత్రి అనగాని సత్యప్రసాద్

మంత్రిని కలిసి తమకు న్యాయం చేయమని వేడుకున్న రైతులు

రేపల్లె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి)ః అగ్నిప్రమాదంలో భారీగా నష్టపోయిన పసుపు రైతులను ఆదుకుంటామని రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ హామీనిచ్చారు. దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులు ఆదివారం రేపల్లెలో మంత్రి అనగానిని కలిసి తమకు న్యాయం చేయమని వేడుకున్నారు. అగ్నిప్రమాదం కారణంగా గోడౌన్‌లో ఉంచిన లక్ష బస్తాల పసుపు నష్టపోయామని తెలిపారు. ప్రతి బస్తాకు 76కేజీలు గోడౌన్‌లో నిల్వఉంచామన్నారు. నష్టపోయి 16నెలలు కావస్తున్న ఇప్పటి వరకు అధికారులు వచ్చి వెళ్ళుతున్నారే తప్పా రైతులకు న్యాయం జరిగిన దాఖలాలు లేవని రైతులు తెలిపారు. అయితే ఇప్పటికే పలుమార్లు మార్క్‌ఫెడ్ ఎండీని కలిసినా సరైన సమాధానం చెప్పటం లేదంటూ రైతులు వాపోతున్నారు. తమను ఆదుకోవాలంటూ నష్టపోయిన రైతులు వేములపల్లి వెంకట్రామయ్య, బసవయ్య, గద్దె శ్రీహరి, ఎన్.సురేంద్ర, వీరాంజనేయులు, గుళ్ళపల్లి సుబ్బారావులు మంత్రి అనగానిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వఉంచిన పసుపుబస్తాలు కాలిపోవటంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సంబంధిత మంత్రి అచ్చెన్నాయుడుతో మాట్లాడి న్యాయం చేసే విధంగా కృషిచేస్తానని హామీనిచ్చారు. బుధవారం సెక్రటేరి యట్‌కు రావాలని రైతులకు సూచించారు.



రైతులతో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

అక్టోబరులో చేనేత సంఘం రాష్ట్ర మహాసభలు

మంగళగిరి సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఈ ఏడాది అక్టోబరు 2, 3 తేదీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరుగుతాయని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ తెలిపారు. మంగళగిరి సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలతో చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లను అమలు జరపకుండా పవర్‌లూమ్ యాజమానులకు రాయితీలు ఇస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడ్జెట్‌లో నామమాత్రపు నిధులు కేటాయించి చేనేతకు అన్యాయం చేశారన్నారు. ఉచిత విద్యుత్తు అమలుకు ఆదేశాలు ఇవ్వలేదని, త్రిఫ్టు ఫండ్‌కు కేటాయించిన రూ.5 కోట్ల నిధులు విడుదల చేయలేదన్నారు. ఈ సమస్యలపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామర్తి రాజు, సహాయ కార్యదర్శి డి.రామారావు, వి.గంగాధరరావు పాల్గొన్నారు.

రాజకీయ సంకల్పంతోనే పోలీస్ సంస్కరణలు సాధ్యం

విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఏబీ వెంకటేశ్వరరావు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు చైతన్యంతో ఉద్యమించి.. ఎన్నికల మ్యానిఫెస్టోలో పోలీస్ సంస్కరణలను ప్రాధాన్యత అంశంగా పెట్టించి, తద్వారా రాజకీయ సంకల్పాన్ని కలిగిస్తేనే భారతదేశంలో పోలీస్ సంస్కరణలు అమలై చట్టబద్ధ పాలన సాధ్యం అవుతుందని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం గుంటూరు జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో పోలీస్ సంస్కరణలపై జరిగిన చర్చా గోష్ఠికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేడు జైళ్ళలో మగ్గుతున్న లక్షలాది మందిలో 85 శాతం పైగా విచారణ ఖైదీలుగా పేద వర్గాలే ఉన్నారని తెలిపారు. న్యాయస్థానాలను రెట్టింపు చేయడం ద్వారా న్యాయాన్ని అందరికీ అందించగలమని తద్వారా థర్డ్ డిగ్రీ ప్రయోగించకుండానే, నేర నిరూపణతో నేరాలను తగ్గించవచ్చునన్నారు. శాసన మండలి మాజీ సభ్యులు కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ సామాన్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వారి సమస్యలను వివరించడానికి భయపడే వాతావరణం నేడు ఉందని, ఫ్రెండ్లీ పోలీస్ రావాలని కోరారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డీఏఆర్. సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ ఐఏఎస్, ఐపీఎస్‌లు కూడా అధికార పార్టీకి దాసోహం కావడం వలన ప్రజాస్వామ్యం ఎలా వికసిస్తుందని ప్రశ్నించారు. ఈ చర్చా గోష్ఠిలో ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు, మానవత చైర్మన్ పావులూరి రమేష్, సామాజిక విశ్లేషకులు టీ ధనుంజయ రెడ్డి, విశ్రాంత అడిషనల్ ఎస్పీ చలపతి రావు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమా ర్, రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షుడు నడింపల్లి గురుదత్, ఇంటెక్ కార్యదర్శి ఎస్. వి. ఎస్. లక్ష్మీనారాయణ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

హాస్టళ్లను వీడరంట?

(5వ పేజీ తరువాయి)

అడ్డదారులు తొక్కుతున్నారన్న ఆరోపణలున్నాయి.

ఆ ఇద్దరి కనుసన్నల్లోనే..

సాంఘీక సంక్షేమ శాఖలో ఇద్దరు అధికారుల కనుసన్నల్లోనే బదిలీల ప్రక్రియ జరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన ఆ ఇద్దరు అధికారులు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని హాస్టల్లో కూర్చుని కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్ సహాయంతో బదిలీల ప్రక్రియ పూర్తి చేసి ఫైల్ కలెక్టరేట్‌కు పంపించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో భారీ మొత్తాలు చేతులు మారినట్లు అర్హులైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఆరోపిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. బదిలీల్లో అక్రమాలపై సాంఘీక సంక్షేమ శాఖ ఇన్చార్జి డీడీ జోబేర దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించలేదు.

- గుంటూరులోని ఓ కళాశాల సమీపంలోని హాస్టల్లో మహిళ వెల్ఫేర్ ఆఫీసర్ దాదాపు తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్నారు. ఓ ఉద్యోగ సంఘం నుంచి సిఫార్సు లేఖ కొనుగోలు చేసి దానిని అడ్డుపెట్టుకుని బదిలీ నుంచి తప్పించుకున్నారని ఆరోపణ.
- కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఓ హాస్టల్లో విద్యార్థులు ఎక్కువ య్యారని చూపి మూడు హాస్టళ్లుగా విభజించారు. ఇక్కడ పోస్టింగ్ కోసం సిఫార్సులు చేయించుకుంటున్నారు. ఇందుకు భారీ మొత్తంలో ఉన్నతాధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా అమరావతి ప్రాంతంలోని ఓ హాస్టల్ నుంచి వెల్ఫేర్ ఆఫీసర్ ఇప్పటికి రెండుసార్లు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నా అధికారులు పట్టించుకోలేదు.
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు ఏడు హాస్టళ్ల విలీనం చేశారు. ఇక్కడ పని చేసిన వెల్ఫేర్ ఆఫీసర్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు. రోజూ కార్యాలయానికి వచ్చి సంతకాలు పెట్టి ఇతర వ్యాపకాల్లో ఉంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.
- కొంతమంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు 10, 20 మంది విద్యార్థులు ఉన్నట్లు చూపి యథాస్థానాల్లో కొనసాగేలా చూసేందుకు ఎత్తులు వేస్తున్నట్లు సమాచారం.
- కొల్లిపర సమీపంలోని ఓ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గుంటూరు నగరంలో కూడా పనిచేస్తున్నారు. తన భార్య ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నందున ఈ భాగంలో పాయింట్లు పొంది బదిలీ కాకుండా చేసుకున్నట్లు సమాచారం.

దేవతల రాజధానిని వేశ్యతో పోల్చుతారా..?

❖ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దేవతలు నడయాడిన నేల, సాక్షాత్తు అమరలింగేశ్వరుడు కొలువుదీరిన పుణ్యక్షేత్రం ఏపీ రాజధానిని కండకావరంతో వేశ్యల రాజధాని అంటారా..? అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని కిడ్స్ పాఠశాల వద్ద వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో పరమ పుణ్య నేల, ప్రజా రాజధాని అమరావతిని వేశ్యల నిలయం అని సంబోధించడం క్షమించరాని నేరం అని ఎమ్మెల్యే జూలకంటి ధ్వజమెత్తారు. జగన్ మీడియాపై ప్రభుత్వం చట్ట ప్రకారం చర్య తీసుకునేలా మాచర్ల నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని శ్రేణులకు ఎమ్మెల్యే జూలకంటి పిలుపునిచ్చారు. డిబేట్ పెట్టిన జర్నలిస్ట్ కొమ్మినేని, పాల్గొన్న కృష్ణంరాజులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జగన్ మీడియాను బ్యాన్ చేయకుంటే విద్వేషాలను రెచ్చగొట్టే మరెన్నో సంఘటనలకు జగన్ అండ్ కో పాల్పడతారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, వైస్ చైర్‌పర్సన్ యర్రాకుల సిద్ధమ్మ సిద్దయ్య యాదవ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, చిరుమామిళ్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణంరాజు, కొమ్మినేనిలను అరెస్టు చేయాలి : శ్రావణ్‌కుమార్

గుంటూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమరావతి పట్ల, రాజధాని ప్రాంతంలోని మహిళల పట్ల దుర్భాషలాడిన కృష్ణంరాజు, దానిని సమర్థించిన కొమ్మినేని శ్రీనివాసరావును వెంటనే అరెస్టు చేయాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అసభ్యకర వ్యాఖ్యలను ప్రోత్సహించి, ఛానెల్‌లో ప్రసారం చేసిన సాక్షి టీవీ యాజమాన్యంపై కూడా కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తన మాటలను కృష్ణంరాజు సమర్థించుకోవడాన్ని బట్టి అవి ముందస్తు ప్రణాళికతో మాట్లాడిన మాటలేనని స్పష్టమవుతోందని చెప్పారు.

జగన్‌మోహన్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి



నరసరావుపేట టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధానిపై తప్పుడు ప్రచారం చేయిస్తూ.. మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడించిన జగన్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలన్నారు. కుంభకోణాల నుంచి ప్రజా దృష్టి మళ్ళించేందుకే జగన్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆచార్య నాగార్జునుడు ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రాంతం, ప్రముఖ బౌద్ధ క్షేత్రం, శాతవాహనుల రాజధాని, బడుగు, బలహీన వర్గాలు అధికంగా ఉన్న ప్రాంతం, నవ్యాంధ్ర ప్రజా రాజధాని అమరావతి అన్నారు. సాక్షి డిబేట్‌లో జర్నలిస్టుల ముసుగులో ఉన్న సంస్కార హీనులు, కిరాయి బ్యాచ్ మహిళలను కించపరుస్తూ నీచపు వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ నేరపూరిత దుష్ప్రచారంపై ప్రభుత్వం, మహిళా కమిషన్, ఎస్సీ కమిషన్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

జగన్, సజ్జల మెప్పు కోసమే... కృష్ణంరాజు వ్యాఖ్యలు

● మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు



మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాదు

గుంటూరు (తూర్పు), జూన్ 8(ఆంధ్రజ్యోతి): జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి మెప్పు కోసమే అమరావతి మహిళలపై జర్నలిస్ట్ కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేసి ఉండవచ్చని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు అభిప్రాయపడ్డారు. గుంటూరు, రాజేంద్రనగర్‌లోని నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సజ్జల పేరోల్ జర్నలిస్టుల్లో కృష్ణంరాజు ఒకరు అని, ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ఆయనకు అలవాటేనన్నారు. గతంలో రాజ్యాంగ రచనలో అంబేద్కర్ పాత్ర లేదని కృష్ణంరాజు వ్యాఖ్యానించాడని గుర్తు చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వ్యతిరేకి కృష్ణంరాజు అని అన్నారు. మహిళలను, దళితులను, మైనారిటీల వర్గాలను కించపరిచే హ్యూడలిస్టు వ్యక్తులను సమాజం నుంచి వెలివేయాలన్నారు. అమరావతి వేశ్యల రాజధాని అంటూ ఆయన మాట్లాడిన భాష దుర్మార్గమైన భాష అని, అటువంటి కు సంస్కారమైన భావజాలం ఉన్న వ్యక్తులు చర్చ వేదికల్లో పాల్గొనకూడదని అన్నారు. కృష్ణంరాజుని సాక్షి టీవీ, సాక్షి పత్రిక, వైసీపీ అనుబంధ టీవీ ఛానల్స్ కు డిబేట్‌లకు రాకుండా బహిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కూటమి నాయకులు పాలకాయల వెంకట్, డేగల సీతారామయ్య పాల్గొన్నారు.

జగన్ మీడియాను బహిష్కరిద్దాం!

● జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల రాజధాని అమరావ తిపై విషం కక్కుతున్న సాక్షి ఛానల్, పత్రికను ప్రజలు స్వచ్ఛందంగా బహిష్క రించాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. అమరావతిరోడ్‌లోని జనసేన పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సాక్షి ఛానల్ డిబేట్‌లో జర్నలిస్టులని చెప్పుకునే ఇద్దరు పనికిమాలిన సన్నాసులు రాజధాని అమరావతిపై నీచాతి నీచంగా వ్యాఖ్యానించడాన్ని జనసేన తరపున ఖండిస్తు న్నామని గాదె స్పష్టం చేశారు. అమరావతి మహిళలపై నీచంగా వ్యాఖ్యానించిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని గాదె వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు శిఖా బాలు, చట్టాల త్రినాద్, మధులాల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి ఫిర్యాదు...

రాజధాని ప్రాంత మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే విధంగా మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై క్రిమినల్ కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు ఆదివారం పశ్చిమ విభాగం డీఎస్పీ కే అరవింద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి మాట్లాడుతూ అమరావతిపై వైసీపీ నేతలు మొదట నుంచి విషం చిమ్ముతూనే ఉందని, రాజధానిని అడ్డుకొనేందుకు ఎన్ని విష ప్రయోగాలు చేసినా ఫలించకపోవడంతో ఉక్రోషంతో మహిళలను అవమానపర్చేలా వ్యాఖ్యలు చేశారని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మొహబూబ్ బాషా, బాలాజీ, నండూరి స్వామి, పడిగిపోగు రమేష్, మిరియాల వెంకట్, సంఫేర్, మంత్రి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఉద్యోగుల బదిలీలకు నేటితో గడువు ముగింపు

గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు గడువు నేటితో ముగిసిపోనుంది. ఇప్పటికే ఒక దఫా గడువు తేదీని పొడిగించిన ప్రభుత్వం మరో సారి ఆ అవకాశాన్ని ఇవ్వలేదు. దీంతో ఇప్పటికే ఉద్యోగులకు వివిధ శాఖలు మాన్యువల్, వెబ్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాయి. ఐదేళ్లుగా ఒకేచోట ఉన్న వాళ్లందరిని వేరే ప్రాంతానికి బదిలీ చేసేందుకు ఉత్తర్వులు సిద్ధం చేశారు. కౌన్సెలింగ్ సందర్భంగా ఆప్షన్-1, 2, 3 ఇచ్చారు. వాటిల్లో అవకాశాన్ని బట్టి పోస్టింగ్‌లు కల్పించారు. అయితే కొన్ని శాఖలు మినహా చాలా ప్రభుత్వ జిల్లా శాఖలు ఉద్యోగులు ఏ స్థానానికి బదిలీ అయ్యారనే విషయాన్ని గోప్యంగా ఉంచాయి. సోమవారం సాయంత్రం వరకు నిరీక్షించి ఆ తర్వాత బదిలీ ఉత్తర్వుల జాబితాలను విడుదల చేయాలని నిర్ణయించాయి. ఒకవేళ ముందుగానే ఉత్తర్వులు ఇస్తే కోర్టులకు వెళ్లి పిటీషన్‌లు దాఖలు చేసే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలిసింది. ఉపాధ్యాయులు, వ్యవసాయం, మార్కెటింగ్, పంచాయతీ రాజ్‌లో పెద్దఎత్తున బదిలీలు జరిగాయి. కౌన్సెలింగ్ సందర్భంగా పలు ఆరోపణలు కూడా వచ్చాయి. ఉద్యోగ సంఘాల పేరుతో ఫేక్ సర్టిఫికెట్లు జత చేసి బదిలీ నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని, అలానే ఆరోగ్యానికి సంబంధించి కూడా నకిలీ ధ్రువీకరణ పత్రాలు అందజేశారన్న ఆరోపణలు వచ్చాయి. వాటన్నింటిని అధికారులు ఏ విధంగా పరిష్కరించారో చూడాలి. కాగా ప్రతీ ఒక్క బదిలీ ఎమ్మెల్యే కనుసన్నల్లోనే జరిగిందన్న విషయం బహిరంగ రహస్యమే. ఆఖరికి వీఆర్‌ఏ, వీఆర్‌వో స్థాయి ఉద్యోగుల పోస్టింగ్‌లకు కూడా ఎమ్మెల్యేలు లేఖలు ఇచ్చారు.

పచ్చని చెట్లతోనే మానవాళి మనుగడ

● బీఎన్‌ఐ ప్రాజెక్టు చైర్మన్ విద్యాధరరావు

గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్ల పెంపకం పైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని బిజినెస్ నెట్‌వర్క్ ఇండియా ప్రాజెక్టు చైర్మన్ విద్యాధరరావు అన్నారు. ఆదివారం బీఎన్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ విద్యాధరరావు మాట్లాడుతూ కనీసం 30శాతం భూమి పచ్చదనంతో నిండేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించినప్పుడే సత్ఫలితాలు కనిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌ఐ నుంచి కే శేషు, పోట్రు వీరయ్యచౌదరి, ఈడీ శేఖర్ బాబు, డిప్యూటీ మేయర్ సజీల, హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ చైర్మన్ జూపూడి రంగారావు, కార్యదర్శి కరస్పాండెంట్ ఎస్ మధుసూదన్ రావు, ప్రిన్సిపాల్ ఎం వీ నాగభూషణం పాల్గొన్నారు.



హిందూ ఫార్మసీ కళాశాలలో మొక్కలు నాటుతున్న బీఎన్‌ఐ అధికారులు

నేడు షైనింగ్ స్టార్స్ అవార్డుల పంపిణీ

● పొన్నూరు రోడ్‌లోని ఏ కన్వెన్షన్‌లో ఏర్పాట్లు

● డీఈవో సీవీ రేణుక

గుంటూరు (విద్య) జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నేడు షైనింగ్ స్టార్ అవార్డులు పంపిణీ చేసినట్లు డీఈవో సివి రేణుక ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు పొన్నూరు రోడ్ లోని ఏ కన్వెన్షన్ సెంటర్లో జరిగే కార్యక్రమానికి ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ హాజరుకానున్నారు. పదో తరగతిలో 112 మందికి, ఇంటర్లో 38 మందికి అవార్డులు అందజేయనున్నారు. విద్యార్థులకు రూ.20 వేల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తారు పురస్కారాలకు అర్హులైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉదయం 9 గంటలకు ఏ కన్వెన్షన్ సెంటర్‌కు రావాలని డీఈవో సూచించారు ఎంపికైన విద్యార్థులు పాఠశాల నుంచి ధ్రువీకరణ పత్రం, ఆధార్ తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ కమిటీకి అందజేయాలన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారులకు ఘన సత్కారం

గుంటూరు(తూర్పు), జూన్ 8(ఆంధ్రజ్యోతి): గోవాలో మే 30 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరిగిన 12వ జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో నగరానికి చెందిన మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడా కారులు జైహింద్, సుబ్బాయమ్మ దంపతులు అత్యున్నత ప్రతిభ కనబరిచారు. యోగా, 100, 400, 1500 మీటర్ల పరుగు పందెం, జావిలెన్ త్రో, డిస్క్ త్రో విభాగాల్లో మొత్తం 7 బంగారు పతకాలు కైవసం చేసుకుని ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా డాక్టర్ జైహింద్ దంపతులను రాయపాటి మిత్ర మండలి వారు ఘనంగా సత్కరించారు. స్థానిక ఎల్వీఆర్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ హాజరై దంపతులను జ్ఞాపిక, శాలువాతో సత్కరించి, నగదు బహుమతిని అంద జేశారు. రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎనిమిది పదుల వయస్సులో జైహింద్ దంప తులు పతకాలు సాధిస్తూ అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమం లో డాక్టర్ రాజా సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ జైహింద్ దంపతులను సత్కరిస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

పింఛనుదారులకు అందుబాటులో ఆన్‌లైన్ విధానం

● ఈదర వీరయ్య

గుంటూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పింఛన్ మంజూరు ప్రక్రియ వేగవంతం చేయటం, మరింత సులభతరం చేయటానికి వీలుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై ఉద్యోగ విరమణ చేసేవారంతా ఆన్‌లైన్‌లో పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ జీవో 228 ద్వారా విడుదల చేసి న నూతన విధాన మార్గదర్శకాల ద్వారా ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర ముఖ్య ఎకౌంటింగ్ జనరల్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏజీఏపీ.సీఏజీ.జీవోవీ.ఐఎన్‌లోకి లాగిన్ అవ్వాలని తెలిపారు. పెన్షన్, జీపీఎఫ్ ఫైనల్ విత్డ్రాయల్ అప్లికేషన్ లింక్ మీద క్లిక్ చేయాలని, హెచ్ ఆర్‌ఎంఎస్ డేటా ప్రకారం ఉద్యోగి ఐడీ నెంబరు, పుట్టిన తేదీ, సర్వీసులో చేరిన తేదీ వివరాలను అందులో రాయాలన్నారు. వివరాలు హెచ్‌ఆర్‌ఎంఎస్ డేటా ప్రకారం ఉంటే ఉద్యోగి వివరాలు నింపటానికి వీలుగా ఎలక్ట్రానిక్ దరఖాస్తు ఓపెన్ అవుతుందని తెలిపా రు. సెల్ ఫోన్ నెంబరు ఎంటర్ చేస్తే తగిన సమాచారం అందుతుంది. అందులో అన్ని వివరాలతో దరఖాస్తును భర్తీ చేయాలన్నారు. పెన్షనర్ తన ఫొటోతో పాటు ఫ్యామిలీ పెన్షనర్‌తో కూడిన డిజిటల్ ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. సంతకాలు లేదా ఎడమచేతి బొటన వేలి ముద్ర మాత్రమే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం పెన్షన్ ప్రతిపాదనలను, జీపీఎఫ్ ఫైనల్ విత్డ్రాయల్ ఫారంను ప్రింట్ అవుట్ తీసుకొని సంతకాలు చేసిన తరువాత పెన్షన్ మంజూరు చేసే అధికారికి సమర్పించాలని తెలిపారు. పెన్షన్ మంజూరు చేసే అధికారి తమ ఐడీలో వెబ్‌సైట్లోకి ప్రవేశించి అన్ని వివరాలు పరిశీలించి అవసరమైన మార్పులు చేసిన తరువాత ప్రింట్ అవుట్ తీసుకొని సంతకం చేసి ఆయా ఉద్యోగుల సర్వీసు పుస్తకంతో కలిపి ఏజీకి పంపించాలని వివరించారు. కుటుంబ పెన్షనర్ల సంబంధించిన ప్రతిపాదనలైన పక్షంలో మరణ ధ్రువీకరణ పత్రం, మెడికల్ సర్టిఫికెట్, వారసుల గుర్తింపు పత్రం అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఆయా పత్రాలను పరిశీలించి ఏజీ పెన్షన్, జీపీఎఫ్ మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

చేపల మార్కెట్ వీధిలో ట్రాఫిక్ ఇక్కట్లు



ట్రాఫిక్‌తో పాదచారులు కూడా నడవలేని స్థితి

గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎటు చూసినా రహదారి ఆక్రమణలు, రోడ్డుకు సగం భాగం వాహనాల పార్కింగ్‌లు, మిగతా సగభాగంలో రాకపోకలకు వాహనదారులు, పాదచారులకు సంకటంగా మారుతోంది. ఇదీ నిత్యం లాలాపేట చేపల మార్కెట్ వీధిలో ప్రజలు పడుతోన్న ట్రాఫిక్ ఇబ్బందులు. కనీసం ఇటు వైపు నగరపాలక సంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తి చూడకపోవటంతో అక్కడ అక్రమణదారులకు ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. లాలాపేట చేపల మార్కెట్ వీధిలో వ్యాపారులు, వినియోగదారుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. అసలే ఇరుకు రోడ్లు, దానికి తోడు వ్యాపారుల ఉత్పత్తులను సగం రోడ్డుపైనే పెట్టుకోవటం, మరో వైపు ఆక్రమణలతో రోడ్డు మరింత కుచించుకుకుపోయింది.



చేపల మార్కెట్ వీధిలో ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు

దాం తో ట్రాఫిక్‌కు మరింత దారుణంగా మారుతోంది. నగరపాలక సంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల సమన్వయం లేకపోవటంతో ఇక్కడ ఆక్రమణదారులను అడిగే వారే లేకపోయారు. దాంతో రోడ్డంతా ఆక్రమ ణలతో నిండిపోయింది. దాంతో రాకపోలకు సంకటంగా మారుతోంది. నగరపాలక సంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో ఆక్రమణలను తొలగించి ప్రజల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

11న సాంబయ్య స్మారక పురస్కార ప్రదానం



అల్లం శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్, సీహెచ్ సాంబయ్య స్మారక పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యాప్రదాత సాంబయ్య 36వ వర్ధంతి, ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్ 16 వార్షిక వేడుకలు ఈనెల 11 జరుగుతాయని సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ భాస్కర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సభలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావుకు సీహెచ్ సాంబయ్య స్మారక పురస్కారంతో సత్కరించనున్నట్లు తెలిపారు. సభానం తరం లేఖ్యా భరణి బృందం విజయవాడ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, పూజిత, అర్చన సిస్టర్స్ గుంటూరు వారిచే భరతనాట్య ప్రదర్శన జరుగుతాయని పేర్కొన్నారు.

క్యాన్సర్‌ను అవగాహనతోనే జయించాలి

● ఆంకాలజిస్టు డాక్టర్ మహతి

గుంటూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను అవగాహనతోనే జయించాలని ప్రముఖ ఆంకాలజిస్టు డాక్టర్ మహతి ఒక ప్రకటనలో తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎంతో మంది ఎదుర్కొంటున్న ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యల్లో క్యాన్సర్ సమస్య ప్రధానంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధి సోకిన వారు అధైర్యపడకుండా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స తీసుకొని సాధారణమైన జీవితాన్ని ఆనందంగా గడపవచ్చని తెలిపారు. ఇటీవల ఈ వ్యాధికి అధు నాతన వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరామ్, చల్లా అంజిరెడ్డి, వీవీ రావు, శ్రీనివాసరావు, వైవీ రెడ్డి తదితరులున్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ రామలింగేశ్వరరావు

షుగర్ రోగులు గాయాలు నిర్లక్ష్యం చేయకూడదు

గుంటూరు మెడికల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): షుగర్ రోగులు తమ పాదాల్లో ఏర్పడే గాయాలు, పుండ్లను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా చికిత్సలు పొందాలని జనరల్ సర్జన్ డాక్టర్ కే రామలింగేశ్వరరావు తెలిపారు. బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సంస్థలో ఆదివారం జరిగిన ఉచిత వైద్యశిబిరం, ప్రజారోగ్య చైతన్యసభలో ఆయన మాట్లాడారు. షుగర్ రోగుల్లో పాదాలకు రక్త సరఫరా తగ్గుతుందని, దీనివల్ల పాదాలకు స్పర్శజ్ఞానం తగ్గుతుందని.. పాదాలకు గాయాలైతే ఇన్‌ఫెక్షన్ పెరిగి గాంగ్రిన్‌గా మారే ప్రమాదముంటుందని డాక్టర్ రామలింగేశ్వరరావు వివరించారు. ఫలితంగా రోగుల ప్రాణాలకు ముప్పు వాటిల్లడంతో పాటు కాలును శస్త్రచికిత్స ద్వారా తొలగించాల్సి వస్తుందన్నారు. ముందస్తు జాగ్రత్తలతో ఈ పరిస్థితి రాకుండా నిరోధించవచ్చని తెలిపారు. అనంతరం జరిగిన ఉచిత వైద్యశిబిరంలో పలువురు రోగులను పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమం లో ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు టీ సేవ కుమార్, దంత వైద్యుడు చల్లా చైతన్య, పీ.నిర్మల మేరి, టీ.ధనుంజయరెడ్డి, ఎం రామారావు, సీహెచ్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గిరిజన గ్రామాలు

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్

గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గిరిజన గ్రామాలు, తండాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూ నాయక్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో జగన్ రెడ్డి గిరిజన ఏజెన్సీ ప్రాంతంలో కనీస సదుపాయాలు కల్పించలేదన్నారు. వెనకబడిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.350 కోట్లు ఇస్తే గత వైసీపీ ప్రభుత్వం నిధులను దారి మళ్ళించిందన్నారు. దీంతో వెనకబడిన జిల్లాలు మరింత వెనకబడ్డాయన్నారు. గిరిజన ప్రాంతాలను కూటమి ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేయటం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నార న్నారు. గిరిజనులకు రహదారి కష్టాలు తీరనున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిపుత్రుల వైద్య సదుపాయం కోసం గిరిజన ఏజెన్సీలలో డోలి మోతకు స్వస్తి పలకడానికి కరడవలసలో కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారన్నారు.

ప్రధానమంత్రి ఫిట్‌నెస్ మంత్రతో అందరికీ ఆరోగ్యయోగం

● ఆక్యు సేవారత్న డాక్టర్ ముంజంపల్లి శివకుమార్

గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫిట్‌నెస్ మంత్రతో అందరికీ ఆరోగ్య యోగం లభిస్తుందని ఆక్యు సేవారత్న డాక్టర్ ముంజంపల్లి శివకుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా డే 2025 కార్యక్రమాల్లో భాగంగా 21 రోజులపాటు జరిగే ఉత్స వాల్లో యోగా శక్తి సాధన సమితి, ఆస్పా భారత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయం నందు ఘనంగా యోగా, ఆక్యు ప్రెజర్‌పై ఉచిత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఆరోగ్యానికి, శాంతికి భారతదేశపు యోగులు లక్షలాది మంది మోడల్స్‌గా ఉన్నారన్నారు. అలాంటి వారిగా తయారవ్వటానికి ప్రధానమంత్రి ఫిట్నెస్ మంత్ర ఉపయోగపడుతుందన్నారు. మరో ముఖ్యఅతిథి యోగ శక్తి సాధన సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా నిర్వహిస్తున్నటువంటి అంతర్జాతీయ యోగా, ఆక్యు ప్రెషర్ అవగాహన కార్యక్రమంలో అందరూ పాల్గొని మందులు లేకుండా, ఆపరేషన్ లేకుండా దీర్ఘకాలిక వ్యాధులను ఆసనాలతో, ఆక్యుప్రెషర్ పాయింట్స్‌తో ఎలా నయం చేయవచ్చో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. తద్వారా అందరూ ఆరోగ్యవంతులుగా ఆరోగ్య ఆంధ్రను నిర్మించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, లైబ్రేరి యన్స్ కొండ చిన్నపరెడ్డి, నంద్యాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆంజనేయ హవనం



పూర్ణాహుతి చేస్తున్న వేద పండితులు

గుంటూరు(తూర్పు), జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణానగర్‌లో శ్రీగోదా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామికి సుప్రభాత సేవ, బాలభోగ నివేదన, నీరాజనం, తీర్థ ప్రసాద గోష్ఠి వైభవంగా జరిగాయి. అనంతరం లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ నిత్య హోమాల్లో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ, ఆంజనేయ హవనం పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణ అనంతరం ఉత్స వ మూర్తులను అలంకరించి విశేష శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొ ని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల్ని ధన కుదరం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు.

ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

● 22 వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సౌత్ డీఎస్పీ భానోదయ, సీఐ వంశీధర్, వెనుక నిందితులు

గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వారి వృత్తి ఆటో డ్రైవర్, బైక్ మెకానిక్.. ప్రవృత్తి ద్విచక్ర వాహనాల దొంగతనం... ఒకరు వాహనాలు చోరీ చేస్తుంటే మరొకరు వాటిని నామరూపాలు లేకుండా విడి భాగాలు అమ్ముకుంటూ పోలీసులకు దొరక్కుండా గుట్టుగా నేరాలకు పాల్ప డుతున్నారు. ఈ విధంగా వీరిద్దరు ఇప్పటివరకు పెద్దఎత్తున ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడ్డారు. పాతగుంటూరు గొలుసుకొండలరావు నగర్‌కు చెందిన బైక్ మెకానిక్ చల్లా అంజిబాబు, గోరంట్ల బొడ్డురాయి సెంటర్‌కు చెందిన ఆటోడ్రైవర్ పరిమిశెట్టి లక్ష్మణ్ అనే ఇద్దరు కలసి కొంతకాలంగా నగరంలో ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్నారు. అంజిబాబు నగరంలో బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తూ 2012 నుంచి నేరప్రవృత్తి కొనసాగిస్తున్నాడు. ఈమధ్య కాలంలో అంజిబాబుతో కలిసి లక్ష్మణ్ బైకు దొంగతనాలకు పాల్పడుతున్నాడు. వీరిద్దరు వ్యసనాలకు బానిసలవడమే దొంగతనాలకు ప్రధాన కారణమని సౌత్ డీఎస్పీ బానోదయ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సౌత్ డీఎస్పీ భానోదయ వివరాలు వెల్లడించారు. ఈ నెల 1న నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని విజయ శ్రీహాస్పిటల్ వద్ద పార్కింగ్ చేసిన తన ద్విచక్ర వాహనాన్ని ఎవరో దొంగిలించారని సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు సీఐ వంశీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు సౌత్ డీఎస్పీ భానోదయ, సీఐ వంశీధర్ , వారి సిబ్బంది సహాయంతో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా స్థానికంగా లభించిన ఆధారాల ద్వారా పరిమిశెట్టి లక్ష్మణ్, చల్లా అంజి బాబులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిని విచారించగా వారు గతంలో గుంటూరు పట్టణంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 21 ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు. కాగా నిందితుల నుంచి 22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో 10, అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 3, పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 వాహనాలు చోరీ చేసినట్లు అంగీకరించారన్నారు. ద్విచక్ర వాహనాలను రికవరీ చేయటంలో కృషి చేసిన సీఐ వంశీధర్, ఎస్‌ఐ జనార్దన్, హెడ్ కానిస్టేబుల్ సుబ్బా రావు, కానిస్టేబుళ్లు మస్తాన్‌వలి, నూరుల్లా, భిక్షునాయక్, సాంబశివరా వు తదితరులను ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించి రివార్డులు ప్రకటిం చారన్నారు. కాగా వారికి భానోదయ రివార్డులు అందించారు.

పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాల విడిభాగాల అమ్మకం

బైక్ మెకానిక్ ముసుగులో చల్లా అంజిబాబు ఎన్నో సంవత్సరాలుగా చోరీ చేసిన ద్విచక్ర వాహనాలు నామరూపాలు లేకుండా విడిభాగాలు అమ్ముకుంటున్నాడని తెలిసింది. తన వద్దకు రిపేర్ కోసం వచ్చిన ద్విచక్ర వాహనాలకు ఆయా చోరీ వాహనాల విడి భాగాలు మారుస్తూ రెండో కంటికి అనుమానం రాకుండా గుట్టుగా ఈ వ్యవహారం సాగి స్తున్నట్లు సమాచారం. అంజిబాబును 2012లో విజయవాడ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. విజయవాడలో ఆయనపై 7 కేసులు ఉన్నాయి. కొత్తపేట పోస్టాఫీస్ రోడ్ లోని షెడ్ కేంద్రంగా ఈ నేరాలకు పాల్పడ్డాడు. లక్ష్మణ్ చోరీ చేసి తీసుకువచ్చిన వాహనాల నుంచి అంజిబాబు విడి భాగాలు అమ్ముతుంటాడు. పాత నేరస్తుడైనప్పటికీ నిఘా లేకపోవడంతో ఏళ్ళ తరబడి ద్విచక్ర వాహన చోరీలు, విక్రయాలు యథేచ్ఛగా సాగాయి.

అమరావతిపై వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

● కత్తెర సురేష్‌కుమార్



మాట్లాడుతున్న కత్తెర సురేష్‌కుమార్

గుంటూరు సిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమరావతి గురించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం రాజధానిని అభివృద్ధి చేయటం చూసి ఓర్వలేక ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు జగన్ మీడియాలో రావడం క్షమించరాని నేరం అన్నారు. మహిళలపై ఇటువంటి వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు దానిని ప్రోత్సహించిన ఇద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాజధాని నిర్మాణం కోసం వేలాది ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చి త్యాగం చేసిన రైతుల మనోభావాలను గాయపరచడమే కాక వారి వ్యక్తిత్వాన్ని కించ పరిచే విధంగా మాట్లాడటం అనేది మానవత్వానికి మాయని మచ్చ అని సురేష్ కుమార్ అన్నారు. రాజకీయ విమర్శలు ఉంటే చేయవచ్చు కానీ వ్యక్తిత్వాన్ని హననం చేసే వ్యాఖ్యలు చేయటం తగదు అన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించి భవిష్యత్తులో మరల ఎవరు మాట్లాడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

● నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో తెలుగుమహిళా నేతల ఫిర్యాదు

గుంటూరు. జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని మహిళలపై దారు ణంగా మాట్లాడిన సాక్షి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళా నేతలు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళా నాయకురాలు, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకులు భీమినేని వందనాదేవి మాట్లాడుతూ సాక్షి టీవీ ద్వారా రాజధాని అమరావతిపై, రాజధాని పరిసర ప్రాంతాల్లో ఉండే మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నల్లపాడుస్టేషన్‌లో ఉన్న సౌత్ డీఎస్పీ భానోదయకు వారు ఫిర్యాదు అందించారు. అనంతరం నల్లపాడు పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ స్మితా పద్మజ, ప్రత్తిపాడు మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఉమా, తెలుగుమహిళా నేతలు లక్ష్మీ గణేష్, సుశీల, తులసి, మేరీ, జయమ్మ, శివమ్మ, నర్మదా, రాములమ్మ, శివజ్యోతి, 41వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బుర్రి సురేష్, ఐటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచుమర్తి శేషుతో పాటు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



సౌత్ డీఎస్పీ భానోదయకు ఫిర్యాదు చేస్తున్న తెలుగుమహిళా నేతలు

మహిళల ఆత్మ గౌరవం దెబ్బతీస్తే సహించేది లేదు

● కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో తెలుగుమహిళా నేతల ఫిర్యాదు

గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మ గౌరవం దెబ్బతీస్తే సహించేది లేదని తెలుగుమహిళా నేతలు ఆదివారం హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి గుడిపల్లి వాణి, కార్పొరేటర్ పోతురాజు సమత తదిత రులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, జగన్ మీడియా చానల్‌పై కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, శనక్కాయల రాజకుమారి, పద్మావతి, శైలజ, ఉమామహేశ్వరి, సింధు, మల్లిక తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట స్టేషన్‌లో డీఎస్పీ అబ్దుల్ అజీజ్‌కు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళా నేతలు వాణి, కార్పొరేటర్ సమత, రాజకుమారి తదితరులు

సుమోటోగా కేసు నమోదు చేయాలి : జంగాల

గుంటూరు(తూర్పు), జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్య లు చేసిన కృష్ణంరాజు, ప్రోత్సహించిన సాక్షి జర్నలిస్టు కేఎస్ఆర్‌పై సుమోటోగా కేసు నమోదు చేసి, వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి ఉద్యమంలో భూములిచ్చిన రైతులు, మహిళలు, దళితులు, బీసీ, మైనార్టీ వర్గాలు నిర్వహించిన పోరాటం ప్రపం చ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించగలిగినదని పేర్కొన్నారు. అలాంటి పోరాటంలో ముందు నిలబడిన మహిళలను వేశ్యలుగా కించపరుస్తూ మాట్లాడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్‌కు మార్ పాల్గొన్నారు.

పాత గుత్తేదారు ఒప్పందం మేరకే.. పోల్స్ ఫీల్డ్‌కు

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఏపీ సీపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ పోల్స్ తయారీ కేంద్రంపై గుత్తేదారు కోర్టు కేసు ఉపసంహరించుకున్నారని, ఈ క్రమంలో ఒప్పందం మేరకు అప్పటి వరకు గుత్తే దారు తయారు చేసిన పోల్స్‌ను ఫీల్డ్‌కు పంపేందుకు మాత్రమే అనుమతించారని సీపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 'పోల్ టెండర్లలో కిరి...కిరి' అనే శీర్షికను 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో ఈనెల 7న ప్రచురితమైన కథనానికి సీఎండీ కార్యాలయం స్పందించింది. సీపీడీసీఎల్ పరిధిలో గుంటూరు కేంద్రంగా ఉన్న విద్యుత్‌పోల్స్ తయారీ కేంద్రం పనుల నిర్వహణ గోవర్ధన్ ఇంజనీరింగ్ గుత్తేదారుడికి ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టు కాలపరిమితి ఈ ఏడాది డిసెంబరు 9 వరకు ఉన్నప్పటికీ గత ఏడాది డిసెంబరులోనే ఒక నెల నోటీసు ఇచ్చి సదరు పనిని రద్దు చేశారని వివరించారు. కాగా సదరు గుత్తేదారు హైకోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు పొందా రని, ఆ తరువాత గుత్తేదారుతో సీపీడీసీఎల్ అధికారులు సంప్రదిం పులు జరిపి కోర్టు కేసును ఉపసంహరించుకోవాలని కోరారన్నారు. దీంతో గుత్తేదారు కోర్టు కేసును ఉపసంహరించుకున్నారని, ఈ క్రమం లో గుత్తేదారు తయారు చేసిన స్తంభాలను (పోల్స్) ఒప్పందం ప్రకా రం ఫీల్డ్‌కు పంపటానికి మాత్రమే అనుమతించారన్నారు. తాజాగా టెండర్లు పిలిచేందుకు ప్రకియను ప్రారంభించామన్నారు. అంతే కానీ ఇందులో ఎవరి ప్రమేయం కానీ, ఎవరికి లబ్ధి చేకూర్చటం కానీ జరగ లేదని స్పష్టం చేశారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి మృతి

దుగ్గిరాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రమా దవశాత్తు రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన డంతో ఒకరు మృతి చెందాడు. గుంటూరు కు చెందిన కొల్లూరు వీరాంజనేయులు, డేవిడ్ అనే మరోవ్యక్తితో కలిసి బైక్‌పైన ఆది వారం కేఆర్ కొండూరు మహంకాళీ అమ్మ వారి ఆలయానికి వచ్చారు. అమ్మవారి ఆల యం నుంచి తిరిగి వెళుతుండగా ఎదురుగా వస్తున్న స్కూటీ, బైక్ ఢీకొన్నాయి. బైక్‌నున్న వీరాంజనేయులు రోడ్డుపైపడి తలకు బల మైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా తనతోపాటున్న, డేవిడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్‌ఐ వెంకటరవి, డేవిడ్ పరిస్థితి విషమంగా ఉండటంతో అతడిని గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. వీరాంజనేయులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్‌వీ) సమితి 2026-27 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. సీబీఎస్‌ఈ సిలబస్‌లో బోధన ఉంటుంది. ఎంపికైన విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు ఉచితంగా బోధించడంతోపాటు, వసతి, భోజనం, పుస్తకాలు, యూనిఫారమ్ కూడా అందిస్తారు.

నవోదయ విద్యాలయలో అడ్మిషన్స్



అర్హతలు:

- **విద్యార్హత:** జేఎన్‌వీకి దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు ప్రైవేట్ / ప్రభుత్వ / ప్రభుత్వ అనుబంధ పాఠశాలలో, 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి.
- **వయస్సు:** విద్యార్థి 2014 మే1 నుంచి 2016 జూలై 31 తేదీ మధ్యలో(ఈ తేదీలతో సహా) జన్మించి ఉండాలి.
- **నివాసం:** విద్యార్థి ఐదో తరగతి చదువుతో పాటు, అదే జిల్లాలో నివాసాన్ని కలిగి ఉండాలి.
- **సీట్లు:** మొత్తం సీట్లను రూరల్, అర్బన్ కోటా కింద విభజిస్తారు. ప్రతి జేఎన్‌వీ పాఠశాలలో 80 సీట్లు ఉండగా గ్రామీణ విద్యార్థులకు 60 సీట్లు, నగర(అర్బన్) విద్యార్థులకు 20 సీట్లు లభిస్తాయి. గ్రామీణ కోటాలోకి రావాలంటే, విద్యార్థి 3వ, 4వ, 5వ తరగతులను పూర్తిగా గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదివి ఉండాలి. ఈ కాలంలో ఒక్క రోజు నగర పాఠశాలలో చదివినా, ఆ విద్యార్థులను నగర కోటాలో పరిగణలోకి తీసుకుంటారు.
- **పరీక్ష విధానం :** పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 80 ప్రశ్నలు వస్తాయి.

విభాగం	మార్కులు	ప్రశ్నల సంఖ్య
మెంటల్ ఎబిలిటీ	50	40
గణితం	25	20
ఆంగ్లం	25	20

- పరీక్ష తరువాత ఒక ఎంపిక జాబితా విడుదల చేస్తారు.

ఎన్ని పాఠశాలలు: ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 15 పాఠశాలలు ఉన్నాయి ఇందులో 13 పాత పాఠశాలలు కాగా ఈ సంవత్సరం కొత్తగా రెండింటిని చేర్చారు. తెలంగాణ ప్రస్తుతం 9 పాఠశాలలు ఉన్నాయి. కొత్తగా ఏడు పాఠశాలలు మంజూరైనప్పటికీ ఈ సంవత్సరపు నోటిఫికేషన్‌లో వాటిని చేర్చలేదు.

- **దరఖాస్తు చివరి తేదీ:** 2025 జూలై 29
- **పరీక్ష తేదీ:** 2025 డిసెంబర్ 13
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
- **వెబ్‌సైట్:** https://navodaya.gov.inspector

దిక్సూచి

SCHOLARSHIP ALERT

IET India Scholarship Award

Description: The Institution of Engineering and Technology (IET) invites undergraduate engineering students to showcase their creativity, innovation, and leadership. This scholarship recognizes and nurtures India's future engineering leaders, empowering them to excel.

Eligibility: Open to full-time 1st, 2nd, 3rd, and 4th-year UG engineering students from AICTE/UGC-approved institutions across all branches. Applicants must have cleared all credit courses in a single attempt with a minimum of 60% marks in aggregate (or 6.0 CGPA on a 10-point scale). There is no age limit.

Prizes & Rewards: Scholarships worth INR 10,00,000

Last Date to Apply: 22-06-2025

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/IET5

buddy4study.com

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

మొత్తం ఖాళీలు: 453

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్ష కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దీని ద్వారా ఇండియన్ మిలిటరీ అకాడమి, ఇండియన్ నేవల్ అకాడమి, ఎయిర్ ఫోర్స్ అకాడమి, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీల్లో అడ్మిషన్ కల్పిస్తారు.

1. ఇండియన్ మిలిటరీ అకాడమి(ఐఎమ్‌ఏ-డెహ్రాడూన్)

- **ఖాళీలు:** 100 (13 ఖాళీలు ఆర్మీవింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కోసం కేటాయించారు)
- **విద్యార్హతలు:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2002 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

2. ఇండియన్ నేవల్ అకాడమి(ఐఎన్‌ఏ-ఎజిమల)

- **ఖాళీలు:** 26 (6 ఖాళీలు నేవల్ వింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కేటాయించారు. 2 హైడ్రో కేడర్ వారికి)
- **విద్యార్హతలు:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2002 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

3. ఎయిర్ ఫోర్స్ అకాడమి(ఐఎఫ్‌ఏ-హైదరాబాద్)

- **ఖాళీలు:** 32 (3 ఖాళీలు నేవల్ వింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కేటాయించారు.)
- **విద్యార్హతలు:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ లేదా ఎంపీసీతో ఇంటర్ చదివి ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.
- **వయస్సు:** 2026 జూలై 1 తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 20 నుంచి 24 సంవత్సరాల మధ్యలో ఉండాలి (2002 జూలై 2 నుంచి 2006 జూలై1 తేదీలోపు జన్మించి ఉండాలి). డీసీసీఏ కమర్షియల్ పైలెట్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు అయితే 26 సంవత్సరాల వయస్సు వరకు అర్హులు.

4. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమి(ఓటీఏ-చెన్నై)(పురుషుల నాన్ టెక్నికల్ కోర్స్)

- **ఖాళీలు:** 276
- **విద్యార్హత:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2001 జూలై 2 నుంచి 2007 జూలై 1 తేదీలోపు జన్మించి ఉన్న అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

5. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమి (ఓటీఏ-చెన్నై)(మహిళల నాన్ టెక్నికల్ కోర్స్)


- **ఖాళీలు:** 19
- **విద్యార్హత:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2001 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన మహిళలు, పిల్లలు లేకుండా విడాకులు పొందిన మహిళలు/ భర్త చనిపోయిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక విధానం:

1. రాత పరీక్ష(ఆబ్జెక్టివ్)
   - ఐఎమ్‌ఏ, ఐఎన్‌ఏ, ఏఎఫ్‌ఏ: ఇంగ్లిష్, జీకే, ఎలిమెంటరీ మేథ్స్(300 మార్కులు)
   - ఓటీఏ: ఇంగ్లిష్, జీకే(200 మార్కులు)
2. ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ(సైకలాజికల్, గ్రూప్ టెస్టింగ్, ఇంటర్వ్యూ)

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 14
- **వెబ్‌సైట్:** https://upsconline.nic.in/

UPSC



సీఎస్‌ఐఆర్ యూజీసీ నెట్



సైన్స్ విభాగాల్లో పరిశోధన, బోధనకు అవకాశం కల్పించే సీఎస్‌ఐఆర్ యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. ఇది జేఆర్‌ఎఫ్‌తోపాటు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉపయోగపడుతుంది.

పరీక్ష పేపర్లు

- కెమికల్ సైన్సెస్
- ఫిజికల్ సైన్సెస్
- లైఫ్ సైన్సెస్
- మేథమెటికల్ సైన్సెస్
- ఎర్త్, అట్మాస్ఫియర్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ పాసై ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు 50 శాతం చాలు.

వయస్సు: జేఆర్‌ఎఫ్‌కు అర్హత విషయానికి వస్తే జనరల్ కేటగిరీ అభ్యర్థులు 2025 జూలై 1 తేదీ నాటికి 30 సంవత్సరాల లోపు ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగ అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు, నాన్ క్రిమిలేయర్ ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్/ పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

పరీక్ష విధానం: పరీక్ష కంప్యూటర్ బేస్డ్ విధానంలో, మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో 200 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు. నెగెటీవ్ మార్కింగ్ ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1150/-, జనరల్, ఈడబ్ల్యూఎస్/ఓబీసీ(నాన్ క్రిమిలేయర్) రూ.600/-, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ అభ్యర్థులకు రూ.325/-.

దరఖాస్తులకు చివరి తేదీ: 2025 జూన్ 23

పరీక్ష తేదీలు: 2025 జూలై 26, 27, 28

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

వెబ్‌సైట్: https://csirnet.nta.ac.in/

నేషనల్ డిఫెన్స్ అకాడమి అండ్ నేవల్ అకాడమి

మొత్తం ఖాళీలు: 406

నేషనల్ డిఫెన్స్ అకాడమి అండ్ నేవల్ అకాడమి ఎగ్జామినేషన్ కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2026 జూలై 1 నుంచి ప్రారంభం అయ్యే ఎన్‌డీఏ 156 కోర్, ఇండియన్ నేవల్ అకాడమి 118 కోర్‌కు సంబంధించిన నోటిఫికేషన్ ఇది. ఆసక్తిగల అవివాహితులైన స్త్రీ, పురుష అభ్యర్థులు యూపీఎస్సీ ఆన్‌లైన్ అప్లికేషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

1. నేషనల్ డిఫెన్స్ అకాడమి(ఎన్‌డీఏ) 370 పోస్టులు

- **ఆర్మీవింగ్:** 208 (మహిళలకు 10)
- **నేవీ వింగ్:** 42 (మహిళలకు 5)
- **ఎయిర్ ఫోర్స్ వింగ్:** ఫ్లైయింగ్ బ్రాంచ్ 92(మహిళలకు 2)
- **గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్):** 18 (మహిళలకు 2)
- **గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్):** 10 (మహిళలకు 2)

2. నేవల్ అకాడమి(10+2 కేడెట్ ఎంట్రీ స్కీమ్) 36 పోస్టులు

- మొత్తం 36 పోస్టులు (మహిళలకు 4)

వయస్సు: 2007 జనవరి 2 నుంచి 2010 జనవరి 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.

విద్యార్హత: ఆర్మీ వింగ్ పదో తరగతి పాసై ఉండాలి

ఎయిర్ ఫోర్స్ అండ్ నేవల్ వింగ్/ ఎన్ఏ కేడెట్ ఎంట్రీ స్కీమ్: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో ఇంటర్ పాసై ఉండాలి.

ఎంపిక విధానం:

రాత పరీక్ష: మేథ్స్ 300 మార్కులు, జీకే+ఇంగ్లిష్ 600 మార్కులు(మొత్తం 900 మార్కులు). తప్పుగా గుర్తించిన సమాధానానికి నెగెటీవ్ మార్కింగ్ ఉంటుంది.

ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూ/ పర్సనాలిటీ టెస్ట్: 900 మార్కులు

ఎయిర్‌ఫోర్స్ కేడెట్స్: కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలెక్షన్ సిస్టమ్(సీపీఎస్ఎస్) పాస్ కావాలి.

దరఖాస్తులకు చివరి తేదీ: 2025 జూన్ 17

పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 14

వెబ్‌సైట్: https://upsconline.nic.in/

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★







అంగరంగ వైభవంగా అఖిల్ రిసెప్షన్



యువ కథానాయకుడు అఖిల్ అక్కినేని వివాహ రిసెప్షన్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు హాజరయ్యారు. మహేశ్ బాబు, రామ్‌చరణ్ కుటుంబంతో సహా విచ్చేశారు. తమిళ హీరో సూర్యతోపాటు దర్శకుడు వెంకీ అట్లూరి హాజరయ్యారు. వీరితోపాటు పలువురు సినీ సెలబ్రెటీలు కూడా సందడి చేశారు. ఈనెల 6న అఖిల్, జైనబ్ వివాహ బంధంతో కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు.

బాలకృష్ణతో మరోసారి



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ విషయాన్ని దర్శకుడు గోపీచంద్ మలినేని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. "గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణతో మరోసారి సినిమా చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సినిమాతో మా కాంబో చేసే గర్జన మరింత ఎక్కువగా ఉండబోతోంది. చరిత్రలో నిలిచిపోయే చిత్రమిది" అని పేర్కొన్నారు. మంగళవారం బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రారంభించనున్నారు. ఇది ఆయన నటించనున్న 111వ చిత్రం. వెంకట్ సతీష్ కిలారు నిర్మించనున్నారు. కాగా, బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో 'వీరసింహా రెడ్డి' అనే చిత్రం వచ్చిన సంగతి తెలిసిందే.

అఖండ 2 టీజర్ వచ్చేస్తోంది

హీరో బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబో హ్యాట్రిక్ కొట్టిన సంగతి తెలిసిందే. వారి కలయికలో నాలుగోసారి తెరకెక్కుతోన్న సినిమా 'అఖండ 2: తాండవం'. ఈ సినిమా టీజర్‌ను నేడు విడుదల చేయనున్నారు మేకర్స్

'మాగంటి'కి చిత్రపరిశ్రమతో అనుబంధం



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా మూడు సార్లు ఎన్నికైన మాగంటి గోపినాథ్‌కు చిత్ర పరిశ్రమతో కూడా అనుబంధం ఉంది. సినీ ప్రముఖులతో మంచి సంబంధాలు ఉన్నాయి. నిర్మాతగా నాలుగు సినిమాలు నిర్మించారు. శ్రీ సాయినాథ్ ఆర్ట్ క్రియేషన్స్ బేనర్‌పై సురేశ్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో 'పాత బస్తీ' అనే సినిమాను 1995లో నిర్మించారు. అనంతరం 2000 సంవత్సరంలో ఆర్‌కే ఫిల్మ్స్ బేనర్‌పై రాజశేఖర్, కృష్ణతో 'రవన్న' అనే చిత్రాన్ని నిర్మించారు. 2004లో దివ్య అక్షర నాగ మూవీస్ బేనర్‌పై తారకరత్నతో 'భద్రాద్రి రాముడు', 2009లో రాజశేఖర్‌తో ' నా స్టైలే వేరు' సినిమాలు నిర్మించారు.



శివుడే నన్ను ఎంచుకున్నాడు

మంచు విష్ణు

విష్ణు కథానాయకుడిగా ముఖేశ్‌కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. డా.మోహన్‌బాబు నిర్మించారు. ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌బాబు మాట్లాడుతూ "దాదాపు ఏడెనిమిదేళ్ల కష్టపడి ఈ సినిమా తీశాం. ఇందులో నటించమని అడిగిన వెంటనే అంగీకరించిన మా బావ ప్రభాస్‌కు కృతజ్ఞతలు. ఈ సినిమాను శివుడు ఆశీర్వదించాడు" అని అన్నారు. "ఈ సినిమాలో ఎవరెవరు పనిచేయాలి అనేది శివాజ్ఞతోనే జరిగింది. ఈ చిత్ర ప్రయాణం నన్ను చాలా మార్చింది. 'కన్నప్ప' కథను మరోసారి చెప్పరా అని శివుడు నన్ను ఎంచుకున్నాడని భావిస్తున్నా" అని మంచు విష్ణు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, రఘుబాబు, శివబాలాజీ, కౌశల్ పాల్గొన్నారు.

సరికొత్త కథాంశంతో 'పయనం'



'రోటీ కపడా రొమాన్స్' ఫేమ్ సుప్రజ్, సంగీర్తన విపిన్ జంటగా 'పయనం' అనే చిత్రంలో నటిస్తున్నారు. చందురామ్ దర్శకత్వంలో స్వర్ణకమల నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ క్లాప్ ఇవ్వగా, సంగీత దర్శకుడు రఘు కుంచె కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా చందురామ్ మాట్లాడుతూ "సరికొత్త కథాంశంతో తెరకెక్కుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

టీఎఫ్‌సీసీ అధ్యక్ష పదవికి

సునీల్ నారంగ్ రాజీనామా

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

ఇటీవల కాలంలో ఇండస్ట్రీలో పలు వివాదాలకూ, సంచలనాలకు కారణమైన సింగిల్ స్ర్కీన్ థియేటర్ల మూసివేత అంశం తాజాగా కొత్త మలుపు తీసుకుంది. తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీఎఫ్‌సీసీ) అధ్యక్ష పదవికి నిర్మాత సునీల్ నారంగ్ ఆదివారం రాజీనామా చేశారు. శనివారం జరిగిన టీఎఫ్‌సీసీ ఎన్నికల్లో నారంగ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవికి ఎన్నికవడం ఇది మూడోసారి. అయితే అధ్యక్ష పదవి చేపట్టి 24 గంటలు కూడా గడవకముందే ఆయన రాజీనామా చేయడం ఇండస్ట్రీ వర్గాల్లో సంచలనం కలిగించింది. 'నాకు సంబంధం లేకుండా నా పేరుతో పబ్లిక్ స్టేట్‌మెంట్స్ ఇస్తున్నారు. సినీ పరిశ్రమ నుంచి ఏదైనా ప్రకటన ఇచ్చేముందు, ఇంటర్వ్యూ, ప్రెస్ మీట్ నిర్వహించే ముందు నాకు సమాచారం ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక టీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా కొనసాగలేను' అని ఆయన టీఎఫ్‌సీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. కానీ ఆయన రాజీనామా కోసం తెరవెనుక పెద్ద తతంగమే నడిచిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు.

శ్రీధర్ విమర్శలపై ఇండస్ట్రీ ఆగ్రహం

కొత్త కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్ టాలీవుడ్ అగ్రహీరోలను ఉద్దేశించి చేసిన పరుష వ్యాఖ్యలు ఇండస్ట్రీలోని కొన్ని వర్గాలకు రుచించలేదని సమాచారం. 'నీ ప్రోద్బలం లేకుండా నీ సమక్షంలోనే అతను అంత దురుసుగా ఎలా మాట్లాడతాడు, నువ్వు అక్కడే ఎందుకు ఖండించలేదు' అంటూ ఇండస్ట్రీ శక్తులు కొన్ని నిప్పులు చెరగడంతో ఎటూ పాలు పోని పరిస్థితుల్లో సునీల్ రాజీనామా చేశారనే మాట వినిపిస్తోంది. పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రాన్ని అడ్డుకునేందుకే థియేటర్ల మూసివేత అంశాన్ని తెరపైకి తెచ్చారని జరిగిన ప్రచారంలో ఆ నలుగురు(అల్లు అరవింద్, దిల్‌రాజు-శిరీష్, సురేశ్‌బాబు) లో సునీల్‌నారంగ్ పేరు ప్రముఖంగా వినిపించిన విషయం తెలిసిందే. అయితే 'అందులో నేను లేను, పవన్ కల్యాణ్ సినిమా అడ్డుకునే సాహసం ఎవరూ చేయలేరు' అని శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సునీల్ నారంగ్ వివరణ ఇచ్చారు. కానీ అదే ప్రెస్‌మీట్‌లో శ్రీధర్ ఇద్దరు దర్శకులు, ఇద్దరు హీరోలు చేసిన కుట్రలో భాగమే ఇదంతా అంటూ చేసిన వ్యాఖ్యలు సునీల్ నారంగ్ మెడకు చుట్టుకున్నాయి.

పవన్ సినిమా రాకుంటే మా పరిస్థితి ఏమిటి?



అసలు ఇంతకీ మీడియా సమావేశంలో శ్రీధర్ ఏమన్నారంటే 'వరల్డ్‌వైడ్ రూ. 2 కోట్ల వసూళ్లు రాని హీరోకి రూ. 13 కోట్ల పారితోషికం ఇచ్చారు. ఒకప్పుడు రెండు మూడు సినిమాలు చేసేవాళ్ల హీరోలు. ఇవ్వాళ రెండేళ్లకో సినిమా తీస్తున్నారు. భారీగా పారితోషికం తీసుకోవడమే దానికి కారణం. పవన్ కల్యాణ్ సినిమా వస్తుందని మేం థియేటర్లు అన్నీ ఖాళీ పెట్టుకున్నాం. ఇప్పుడు ఈ నెల మొత్తం వృథాగా పోయినట్లే. హీరోలకు ఈ స్టార్‌డమ్ ఎక్కడ నుంచి వచ్చింది. ఒక హీరో ఏడాదికి రెండు సినిమాలైనా చేయకపోతే సింగిల్ స్ర్కీన్లు నడవవు. లేదంటే గోదాములు, సూపర్ మార్కెట్లు అవుతాయి. తెలంగాణ ఎగ్జిబిటర్ల నుంచి థియేటర్ల ప్రతిపాదన రాలేదు. ఇద్దరు దర్శకులు, ఇద్దరు నిర్మాతలే దీని వెనుక ఉన్నారు. టైమ్ వచ్చినప్పుడు పేర్లు చెబుతాను' అని సీరియస్ వ్యాఖ్యలు చేశారు.



శ్రీధర్

హీరోలు అంటే దేవుళ్లు

సినీ పెద్దల ఆగ్రహాన్ని చల్లబరిచే ప్రయత్నంలో భాగంగానే సునీల్ నారంగ్ రాజీనామా చేశారనే ప్రచారం జరుగుతోంది. పవన్ కల్యాణ్ సినిమాతో పాటు మా కుబేర సినిమా కూడా అదే సమయంలో విడుదలవుతుండగా, మేం థియేటర్లను మూయాలని ఎందుకు అనుకుంటాం అని ప్రశ్నించారు. డిజిటల్ మీడియాకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూల్లో సైతం ఆయన హీరోలను ఆకాశానికి ఎత్తారు. 'మనదేశంలో డబ్బున్నోళ్లు చాలామంది ఉన్నారు. కానీ హీరోలవ్వలేదు. కోటి మందిలో ఒక హీరో పుడతాడు. వాళ్లు దేవుళ్లు. హీరో అవ్వడం అంత వీజీ కాదు. 145 కోట్ల జనాభాలో 40 మంది హీరోలున్నారు' అంటూ స్పందించారు. తాజా వివాదానికి ఆజ్యం పోసిన శ్రీధర్ వ్యాఖ్యలతోనూ తనకు సంబంధం లేదని చెప్పే ప్రయత్నం చేశారు. 'శ్రీధర్ చెప్పిన మాట వినడు. నిన్న నేను ఆయన్ను చూసి వెనక్కు వెళుతుంటే బలవంతంగా తీసుకెళ్లి ప్రెస్‌మీట్‌లో కూర్చోబెట్టారు. ఆయనకు ఎవరు రాసిచ్చారో, ఆయనతో ఎవరు అలా మాట్లాడించారో నాకు తెలియదు. నేను ప్రెసిడెంట్‌ని, ఆయన సెక్రటరీ... కాబట్టి నా పక్కన కూర్చొని మాట్లాడాడు. దాంతో నాకేం సంబంధం లేదు. ఆయన మాటల వెనుక నా ప్రోద్బలం ఉండి ఉంటే మీడియా సమావేశంలో ఆయన పక్కన ఎందుకు కూర్చుంటాను. అసలు ప్రెస్‌మీట్‌లో ఆయన ఏం మాట్లాడతాడనేది కూడా నాకు తెలియదు. ఆయన మాటలతో నేను షాక్‌కు గురయ్యాను. 'హీరోలు ఎన్ని సినిమాలు చేయాలో చెప్పడానికి నువ్వెవరు' అన్నాను. ఆయనకు మాట్లాడడం రాదు. నా స్నేహితుడు అయినంత మాత్రాన ఆయన ఏం చేసినా దానికి నేను పూచీ కాదు' అని బదులిచ్చారు.

అందుకే హీరోలతో కలిసి థియేటర్ల నిర్మాణం

'మల్టీప్లెక్స్‌ల్లో రెండు సినిమాలు విడుదలైతే ఒకటి ఫ్లాప్ అయినా, ఒకటి హిట్ అవుతుంది. దానికి షోలు పెంచుతాం. సేఫ్ అయిపోతాం. సింగిల్ థియేటర్‌లో వేసిన సినిమా ఫ్లాప్ అయితే ఇక ఏం చేయలేం. అందుకే టాలీవుడ్ అగ్రహీరోలతో కలసి థియేటర్ల నిర్మాణం చేపట్టాం. అది భాగస్వామ్య వ్యాపారం. అందులో తప్పేం ఉంది. ప్రాజెక్ట్‌కి క్రేజ్ వస్తుంది. అలాంటి ఆలోచనతో ఇంకెవరూ వెళ్లలేదు. మేం వెళ్లాం. వాళ్లు ఓకే చేశారు. ఆ స్టార్‌కి కూడా లాభం ఉంటుంది. పైగా ఇలాంటి మల్టీప్లెక్స్‌లు పది కట్టుకుంటే 'ఆ నలుగురు', గుత్తాధిపత్యం లాంటి నిందలు అన్నీ పోతాయి' అన్నారు.

'తెనాలి బండ్‌పై బొల్లిముంత విగ్రహం ప్రతిష్ఠించాలి'

తెనాలి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ విగ్రహాన్ని తెనాలి బండ్‌పై ప్రతిష్ఠించాలని సాహిత్యవేత్త రంగిశెట్టి రమేష్ కోరారు. సీపీఐ కార్యాలయంలో ఆదివారం బొల్లిముంత 21వ వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఆళ్ల నాగేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, రఘునాథరావు, విజయసారధి, శ్రీరామమూర్తి, మధు, బెన్‌హర్ పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

మహిళలను కించపరిచే వారిపై చర్యలు తీసుకోవాలి

● మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని

తెనాలి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచే వారిపై చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి కోరారు. తెనాలిలోని ఆమె స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, రాజధాని నిర్మాణాన్ని పూర్తిచేస్తే వైసీపీకి పుట్టగతులు ఉండవనే ఆలోచనతోనే అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. మహిళలను అవమానించిన ఏ ఒక్కరూ బాగుపడలేదని చరిత్ర కూడా చెబుతుందన్నారు. సాక్షి టీవీ, పేపర్, పనికట్టుకుని కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తోందని చెప్పారు. ఇలాంటి పరిణామాలకు ఫుల్‌స్టాప్ పెట్టకపోతే రాష్ట్రాన్ని మరింత దిగజార్చేందుకు వెనుకాడరని చెప్పారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని మహిళలను కించపరిచిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

సమాజంలో అసమానతల నివారణే 'మానవత' ధ్యేయం

● వ్యవస్థాపకులు శ్రీరామచంద్రారెడ్డి

తెనాలి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అసమానతలు నివారించేందుకు మానవత స్వచ్ఛంద సంస్థ ధ్యేయంగా పని చేస్తుందని వ్యవస్థాపకులు శ్రీరామచంద్రారెడ్డి తెలిపారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్‌లో ఆదివారం సంస్థ ఎగ్జిక్యూటివ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. తెనాలి ప్రాంతంలో చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్రంలోని అన్ని సంస్థలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాజాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో సభ్యులు కృషిచేయాలని కోరారు. దేశం మొత్తం ఏదో ఒకరోజు సంస్థ వైపు చూసే విధంగా పనిచేయాలని పేర్కొన్నారు. సంస్థ చైర్మన్ కొలసాని రాంచంద్, రీజియన్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, ప్రసాద్, వెంకట్, ఆంజనేయరెడ్డి, మొవ్వా సత్యనారాయణ, నరసింహారావు, సోమయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు పురపాలక సంఘంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తెనాలి, మారీసుపేట,జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను పలు శాఖల అధికారులతో కలసి నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ శేషన్న పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట,జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో పాదచారులకు శ్రీశైల భక్తసేవా సమితి సభ్యులు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం స్థానిక చెంచుపేట మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శ్రీ శైల భక్త సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో విష్ణుమొలకల బ్రదర్స్ అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాదచారులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అడపా సంపత్ రాయుడు, సుధాకర్, కృష్ణ, కోటేశ్వరావు, వీవీఆర్ నాయుడు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం పునః నిర్మాణానికి శంకుస్థాపన

కొల్లిపర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలోని శ్రీగంగాపార్వతిసమేత ముక్తేశ్వరస్వామి దేవస్థానం పునః నిర్మాణానికి పండితులు, గ్రామ పెద్దలు శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శైవాగమ శాస్త్రరీత్యా ప్రతిష్ఠాచార్యులు దుర్గారావు ఆధ్వర్యంలో వేద పండితులు కొల్లిపర పిచ్చియ్యశర్మ, కొల్లిపర కుటుంబరావు, ముక్కామల వెంకటరత్నశర్మ, సోమరాజుపల్లి నాగరాజు, కొల్లిపర నిరంజన్‌కుమార్‌శర్మ, పోగుల రామలింగేశ్వరశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించి శివాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నెర్ల గురవారెడ్డి, అరిమండ బసవ కుటుంబరెడ్డి, బొంతు గోపాల్‌రెడ్డి, కొల్లి పుల్లారెడ్డి, అవుతు బసివిరెడ్డి, గుదిబండి శ్రీనివాసరెడ్డి, భీమవరపు బసివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

పెదకాకాని, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు ఆదివారం పిలుపునిచ్చారు. మండలంలోని పలు కాలనీలలో ఆయన ప్రచార యాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానాలు చేసిందన్నారు నేటికీ తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, నాయకులు రాజా రమేష్, రామచంద్రరావు, బి.రమేష్ రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు

ప్రమాదాలకు నిలయంగా బస్టాండ్ కూడలి

● వాహనాలు క్రమబద్ధీకరించే వారు లేక ప్రమాదాలు
● మంగళగిరి ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ
● అధికారులు దృష్టిపెడితే ప్రమాదాల నివారణ



గతంలో ప్రధాన రోడ్డు నుంచి బస్టాండ్‌కు వెళ్లే క్రమంలో బస్సును ఢీ కొట్టిన ద్విచక్రవాహనం (ఫైల్‌ఫోటో)

తెనాలి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు నిలయంగా తెనాలి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలి మారింది. అటు మంగళగిరి ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు ఆ రోడ్డు మీదుగా ప్రయాణం సాగిస్తుంటారు. తెనాలి బస్టాండ్ నుంచి వివిధ ప్రాంతాలకు వందలాది బస్సు సర్వీసులు నిత్యం తిరుగుతుంటాయి. ప్రయాణికులను తీసుకువెళ్లేందుకు, బస్టాండ్‌కు వచ్చేందుకు మంగళగిరి ప్రధాన రహదారిపైరాకపోకలు సాగిస్తుంటాయి. బస్టాండ్ కూడలి వద్ద వాహనాలను క్రమబద్ధీకరించేలా పోలీసులగానీ, ట్రాఫిక్ సిగ్నల్స్‌గాని ఏర్పాటు చేయలేదు. దీంతో బస్టాండ్‌కు వెళ్లే వాహనాలు ప్రధాన రహదారికి చేరే క్రమంలో వేగంగా వచ్చే వాహనాలు అదుపుకాక ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇటీవల ప్రధాన రోడ్డు నుంచి బస్టాండ్‌కు వెళ్లే క్రమంలో బస్సును ద్విచక్రవాహనదారుడు వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదేవిధంగా మరో ద్విచక్రవాహనదారుడు అదే రోడ్డుపై వస్తుండగా ఓ ఆటో డ్రైవర్ బస్టాండ్ రోడ్డుగా రావడంతో వాహనం అదుపుతప్పి ఢీ కొట్టిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇలా గత కొంతకాలంగా అనేక ప్రమాదాల బారినపడిన వారు వందల సంఖ్యలో ఉన్నారు. ఈ ప్రమాదాలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖ అధికారులు సురక్షిత చర్యలు చేపట్టి ప్రయాణం సురక్షితంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.


ర్యాలీలో ప్రసంగిస్తున్న కమలానంద భారతిస్వామి

ఘనంగా శివాజీ మహరాజ్ పట్టాభిషేక మహోత్సవం

తెనాలి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ స్మారక సమితి ఆధ్వర్యంలో ఆదివారం తెనాలిలో శివాజీ మహరాజ్ పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మార్కెట్ యార్డు నుంచి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఊరేగిస్తూ పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శివాజీ గొప్పతనాన్ని వివరించారు. సమితి అధ్యక్షుడు మైలా హరికృష్ణ, హిందూ చైతన్యవేదిక ఉపాధ్యక్షుడు అంబటి మారుతీరామ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అవ్వారు శ్రీనివాసరావు, రామరాజు, హరివెంకట్, నాగేంద్రం, వాసుదేవనాయుడు, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

తూములూరులో ఘనంగా గంగానమ్మ కొలుపులు

కొల్లిపర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూములూరులోని గంగానమ్మ అమ్మవారి కొలుపులను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీగంగానమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. కొంతమంది భక్తులు అడుగులు, మడుగులతో మేళతాళాలతో ఆలయానికి చేరుకుని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. పెద్దలు, పిల్లలు, మహిళలు మెడలో గారెలు, బూరెలు దండలు వేసుకుని, మొలకెత్తిన గింజలు మూకుళ్లతో మూకుమ్మడిగా తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి పూజలు నిర్వహించారు. కొలుపులతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.



పెదకాకాని సీఐ నారాయణస్వామికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ వీరనారాయణ

వివేకా విద్యార్థి పవన్‌కు ఇంజనీరింగ్‌లో 434వ ర్యాంకు

తెనాలి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వివేకా జూనియర్ కళాశాల విద్యార్థి తూనుగుంట్ల పవన్‌కుమార్ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల్లో 434వ ర్యాంకు సాధించి తెనాలి సత్తా చాటాడు. నాజరుపేటలోని కళాశాలలో ఆదివారం డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, ఈఏపిసెట్ ఫలితాల్లో సాధించిన ర్యాంకులను వివరించారు. పవన్ కుమార్ ఐఐటి అడ్వాన్స్‌లో 4759 ర్యాంకు, మెయిన్స్‌లో 99.37 శాతం పర్సంటైల్ సాధించిన విషయం తెలిసిందేనన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించిన పవన్ పదో తరగతి, ఇంటర్‌లలో కూడా మంచి ప్రతిభ కనబరిచాడని చెప్పారు. మరో విద్యార్థి జశ్వంత్ 2742వ ర్యాంకు సాధించాడు. 10 మంది విద్యార్థులు పది వేల లోపు ర్యాంకులు, 15 మంది విద్యార్థులు 15 వేలు లోపు ర్యాంకులు సాధించి మంచి కళాశాలలో అడ్మిషన్లు పొందుతారని అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను స్వామి భాస్కరానంద సరస్వతి సత్కరించారు. ప్రిన్సిపల్స్ జ్యోతి, శ్రావణి, డీన్ శ్రీనివాసరావు, సునీల్ పాల్గొన్నారు.

అసభ్య వ్యాఖ్యలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

● పెదకాకాని పోలీస్‌స్టేషన్లో టీడీపీ నాయకుల ఫిర్యాదు

పెదకాకాని, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని మహిళలపై అసభ్యంగా మాట్లాడి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. ఆదివారం ఈ మేరకు పెదకాకాని సీఐ నారాయణ స్వామికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ దేవతలు, గౌతమ బుద్ధుడు కొలువైన ప్రదేశం, శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించిన రాజధాని పేరు అమరావతి అని, అలాంటి పవిత్రత కలిగిన రాజధాని పేరును పెడితే కొందరు స్వార్థపరులు అసభ్య పదజాలంతో మహిళలను దూషించటం సమంజసం కాదన్నారు. అహంకారంతో, దుర్మార్గంగా మాట్లాడిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరరావులను, వారిని ప్రోత్సహించిన సాక్షి టీవీ చానల్ యాజమాన్యం వైయస్ భారతిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, జిల్లా తెలుగు మహిళ నాయకురాలు మలినేని రుక్మిణి, టీడీపీ నాయకులు సాల్మన్ రాజు, మహిళ నాయకులు పాల్గొన్నారు.


డాక్టర్ రాకేష్‌ను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

ఎముకలు పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి

● ఆర్థోపెడిక్ వైద్యుడు రాకేష్

తెనాలి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఎముకలు పటిష్టంగా ఉండేలా చూసుకోవాలని ఆర్థోపెడిక్ వైద్యులు టి.రాకేష్ చెప్పారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం అమరావతి కాలనీలో నిర్వహించారు. గుమ్మడి నారాయణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైద్యుల సలహాల మేరకు మందులు వినియోగించాలన్నారు. బీపీ, షుగర్ ఉన్న సిటిజన్లు నొప్పులకు వాడే టాబ్లెట్లలో ప్రొటీన్లు, విటమిన్లు ఉండేలా చూడాలని, వీలైన వ్యాయామం చేయాలన్నారు. కీళ్లకు అవసరమైతే సర్జరీ చేయించుకోవాలని తరువాత ఫిజయోథెరపి కూడా అవసరమవుతుందన్నారు. సంఘ ప్రతినిధులు డాక్టర్‌ను ఘనంగా సన్మానించారు. సీనియర్ సిటిజన్లను సత్కరించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, భాస్కరరావు, శివప్రసాద్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మాచవరం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

పొన్నూరుటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం గ్రామాభివృద్ధికి కూటమి ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు అన్నారు. మాచవరం గ్రామంలో ఆదివారం రూ 11.40 లక్షలవ్యయంతో నిర్మించే పలు రహదారుల నిర్మాణానికి టీడీపీ నాయకులు భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి గ్రామంలో ఈ రహదారుల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో మౌలికవసతుల కల్పన చేయకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, నిమ్మగడ్డ వెంకట ధర్మారావు, సుశీలరావు, విజయ్‌కుమార్, రవిచంద్ర, రాధాకృష్ణ, రాంగోపాల్ వర్మ, బ్రహ్మయ్య, షేక్ చిన్నా పాల్గొన్నారు.


ఆచార్య ఎన్జీ రంగా సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆచార్య ఎన్జీరంగాకు ఘన నివాళి

పొన్నూరు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రైతు జన బాంధవుడు ఆచార్య ఎన్జీ రంగా 30వ వర్ధంతిని ఆదివారం పొన్నూరు పట్టణంలో నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో రంగా స్మృతివనం వద్ద నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని ఎన్జీ రంగా విగ్రహం వద్ద వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడిగా రైతాంగ ఉద్యమ నేతగా సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా దేశానికి ఆచార్య ఎన్జీ రంగా చేసిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో బొద్దులూరి రంగారావు, ఆకుల జానకిబాబు, గోగినేని అనీల్‌కుమార్, గురుబాలు, కంచర్ల రాజేష్, మధుబాబు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు ఇవ్వాలి

● రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

తెనాలి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రైతులు, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వం రూ.20వేలు పెట్టుబడి సాయంగా అందివ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గుడివాడలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రైతులు, కౌలురైతులను కలిసి వారి యోగక్షేమాలను విచారించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ యజమానులకు అన్నదాత సుఖీభవ ఇచ్చినా కౌలు రైతులకు కూడా అందిస్తామని తెలిపారన్నారు. అయితే గత సంవత్సరం ఎటువంటి సాయం అందించలేదన్నారు. ఈ ఏడాదైనా ఇస్తారో లేదోనన్న ఆందోళన రైతుల్లో ఉందన్నారు. ప్రతి కౌలు రైతుకు కార్డులు అందేలా చూడాలన్నారు. ఈ క్రాప్ నమోదులో కూడా వాస్తవ సాగుదారులను గుర్తించి వారి పేరుతోనే నమోదు చేయాలన్నారు. కవులు రైతులు, సాగుదారులకు పంట రుణాలు రీషెడ్యూల్ చేసి కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 11న మంగళగిరి వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద తలపెట్టిన కార్యక్రమానికి రైతులందరూ రావాలని కోరారు. రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు ముద్దన సాంబశివరావు మాట్లాడుతూ సీసీఎల్ఏ వ్యవసాయశాఖ కమిషనర్‌కు వ్యక్తిగత అర్జీలతో వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుందని, కౌలు రైతులందరూ అర్జీలు తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలో జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్, కర్రె మోషే, గొట్టి ముక్కల ప్రేమయ్య పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవం


చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని శలపాడులో శ్రీ గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి ఆలయ ధ్వజప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో స్థానిక ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని చంద్రశేఖర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వలన ధ్వంసం అయిన ధ్వజస్థంభాన్ని కొద్దిరోజుల్లోనే గ్రామస్థులు, ఆలయ కమిటీల సహకారంతో పునః ప్రతిష్ఠ చేయడం జరిగిందన్నారు. సహకారం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 6 వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో శలపాడు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


డీవీసీ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో యోగాసనాలు వేస్తున్న పట్టణ వాసులు

ప్రతి రోజు యోగాతో ఆరోగ్యకర జీనవం

● మాజీ డిప్యూటీ ఎయిర్ చీఫ్ మార్షల్ షేక్ సుభాని

పొన్నూరు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు యోగా చేయడం అవలరచుకోవడం ద్వారా ఆరోగ్యకర జీవనం అలవడుతుందని మాజీ డిప్యూటీ ఎయిర్ చీఫ్ మార్షల్ షేక్ సుభాని అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం ధూళిపాళ్ల వీరయ్య చౌదరి ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ఆదివారం సీనియర్ సిటిజన్స్‌తో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువులు సీనియర్ సిటిజన్స్‌తో పలు యోగాసనాలు వేయించి యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పలువురు ప్రముఖులు మాట్లాడుతూ యోగాను అభ్యసించడం ద్వారా ఒత్తిడిని జయించి మానసిక ప్రశాంతతో, శారీరక ధృఢత్వం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు, పొన్నూరు టౌన్ డెవలప్‌మెంట్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ యాసిన్ బాబా, వట్టికూటి లీల ప్రసాద్, ఉప్పల సుకుమార్‌బాబు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఆకుల సాంబశివరావు, యోగా గురువులు మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ ప్రతిష్ఠ

పొన్నూరుటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పొన్నూరులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. రుత్విక్‌లు రమణ, రామశాస్త్రి ఆధ్వర్యంలో ఈ మహోత్సవాలను నిర్వహించారు. ధ్వజస్తంభ దాతలు ఆధ్వర్యంలో ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించి శాంతిహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి ప్రకాశ్, వనమా మాణిక్యరావు, ప్రసాద్, మద్ది రమేష్, కొమ్మూరి శ్రీనివాసరావు, కొంజేటి ఆంజనేయులు, నీరిశెట్టి నరసింహారావు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటర్‌లో వివేక విద్యార్థులకు అత్యధిక మార్కులు

తెనాలి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ ఇంటర్‌లో వివేకా విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ఇంటర్ బెటర్‌మెంట్ పరీక్షలు రాసిన విద్యార్థులలో ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను ఇద్దరు విద్యార్థులు సుహాన, కృష్ణప్రియ 467 మార్కులు సాధించారు. నాజరుపేటలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, స్వామి భాస్కరానంద సరస్వతి అభినందించారు. వేదవర్షిణి, ఎల్.లిఖిత, అస్రఫ్‌లకు 465 మార్కులు, పవన్‌సాయి, నిషాంత్ 464 మార్కులు సాధించారు. ఎంఈసీలో 500 కు గాను వై.లిఖిత 486 మార్కులు సాధించింది. బైపీసీలో 440 మార్కులకు గాను మిస్బా 433 మార్కులు సాధించింది. ప్రిన్సిపల్ జ్యోతి, శ్రావణి, శ్రీనివాసరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో డైరెక్టర్ వీరనారాయణ, భాస్కరానంద సరస్వతి

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

● మున్సిపల్ కమిషనర్ శేషన్న


యోగా చేస్తున్న కమిషనర్ శేషన్న, సీనియర్ సిటిజన్‌లు

తెనాలి, మారీసుపేట,జూ న్ 8(ఆంధ్రజ్యోతి): యోగాభ్యాసంతోనే సంపూర్ణ ఆరో గ్యం సాధ్యమౌతుందని ము న్సిపల్ కమిషనర్ బండి శేష న్న అన్నారు. ఆదివారం స్థా నిక కొత్తపేటలోని శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక యోగా శిక్షణ శిబిరా న్ని మున్సిపల్ కమిషనర్ శేషన్న పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగాంధ్రా శిక్షణ శిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మంగళగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జూలై 9వ తేదీన జరుగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చెంగయ్య పిలుపునిచ్చారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం యూనియన్ విస్తృత సమావేశం జరిగింది. చెంగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసేలా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందన్నారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమండ్ చేస్తూ జరుగుతున్న సమ్మెలో ఎయిమ్స్ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం 21 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎం బాలాజీ, అధ్యక్షుడిగా కే పరమేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కే బుజ్జిబాబు, ఉపాధ్యక్షుడిగా కేవీఎస్ కిరణ్, ఆర్ నాగేశ్వరరావు, పీ జ్యోతి, కోశాధికారిగా గాలి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా రవికుమార్, మనోజ్ బాబులను ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

కాకుమానులో దొంగల హల్‌చల్

కాకుమాను, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కాకుమానులో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. కాకుమాను పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కాకుమాను గ్రామానికి చెందిన కొంగర శ్రీనివాసరావు తన ఇంటికి తాళం వేసి బయటకి వెళ్లి తిరిగి వచ్చి చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తులు తలుపు పగులకొట్టి బీరువాలో ఉంచిన రూ.10 వేల నగదు అపహరించారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆదివారం తెలిపారు.

250 మందికి వైద్య పరీక్షలు

పెదనందిపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అన్నపర్రు జడ్పీ పాఠశాలలో కొల్లా కొండలరావు హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రేయాస్, డీవీసీ, రమేష్ హాస్పిటల్స్ వారి సహకారంతో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు 250 మందికి బీపీ, రక్త, షుగర్, గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఈనెల 15న నిర్వహించే మెగా వైద్య శిబిరంలో ఆయా వ్యాధులకు సంబంధించిన వైద్యులచే చికిత్సలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయనున్నట్లు క్యాంప్ నిర్వాహకులు డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు.

ఘనంగా శ్రీగంగానమ్మ ఆలయ వార్షికోత్సవం



రేవేంద్రపాడులోని శ్రీగంగానమ్మ వార్షిక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దుగ్గిరాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రేవేంద్రపాడులోని శ్రీగంగానమ్మ ఆలయ పదో వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపస్థాపన, నవగ్రహ మండపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పలురకాల అభిషేకాలు జరిపిన అనంతరం పుణ్యదంపతులతో శాంతిహోమం నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు శ్రీగంగానమ్మ ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి మృతి

దుగ్గిరాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందాడు. గుంటూరుకు చెందిన కొల్లూరు వీరాంజనేయులు, డేవిడ్ అనే మరోవ్యక్తితో కలిసి బైక్‌పై ఆదివారం కేఆర్ కొండూరు మహంకాళీ అమ్మవారి ఆలయానికి వచ్చారు. అమ్మవారి ఆలయం నుంచి తిరిగి వెళుతుండగా ఎదురుగా వస్తున్న స్కూటీ, బైక్ ఢీకొన్నాయి. బైక్‌పైనున్న వీరాంజనేయులు రోడ్డుపైపడి తలకు బలమైన గాయంకావడంతో అక్కడికక్కడే మృతి చెందగా తనతోపాటున్న, డేవిడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్‌ఐ వెంకటరవి, డేవిడ్ పరిస్థితి విషమంగా ఉండటంతో అతడిని గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. వీరాంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్కూటీపైనున్న శ్రీనివాసరావు అనే వ్యక్తికి సైతం గాయాలైనట్లు తెలుస్తోంది. హెల్మెట్ లేకపోవడంతో తలబలంగా రోడ్డుకు తాకడంతోనే అంజి మృతి చెందాడని ఎస్‌ఐ పేర్కొన్నారు.

మాజీ ఏజీపీ కోసూరి మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

మంగళగిరిసిటి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి బార్ అసోసియేషన్ న్యాయవాది, మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ కోసూరి చంద్రశేఖర్ (56) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. చంద్రశేఖర్ గతంలో మంగళగిరి ఏజీపీగా పని చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న చంద్రశేఖర్‌ను తాడేపల్లి పరిధిలోని ఓ కార్పొరేట్ వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. చంద్రశేఖర్ ఆత్మకూరు పరిధిలోని అక్షయపాత్ర సమీపంలో ఉన్న సీతారామ రెసిడెన్సీలో నివసిస్తున్నారు. చంద్రశేఖర్ మృతికి మంగళగిరి బార్ అసోసియేషన్ న్యాయవాదులు, స్థానికులు సంతాపం వ్యక్తం చేసి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతి తీరనిలోటని పలువురు న్యాయవాదులు వ్యాఖ్యానించారు. అంత్యక్రియలు సోమవారం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

వ్యర్థాలు ఇలా.. నీరు పారేదెలా..

- ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కాలువ మురుగుమయం
- అపార్టుమెంట్ల వ్యర్థాలన్నీ పంట కాలువలోకే
- ఖరీఫ్ సమీపించినా పూడిక తీయని వైనం
- భూములు సారం తగ్గి ప్రశ్నార్థకంగా సాగు
- పట్టించుకోని అధికారులు • రైతుల గగ్గోలు



కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

తాడేపల్లి (కుంచనపల్లి), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచనపల్లిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ పథకాన్ని 1965లో ప్రారంభించారు. గతంలో పంపింగ్ స్కీమ్ కింద 3769 ఎకరాల ఆయకట్టు ఉండేది. అయితే క్రమేపీ ఆయకట్టు విస్తీర్ణం తగ్గిపోయి నేడు సుమారు 1500 ఎకరాల్లోనే పంపింగ్ స్కీమ్ కింద రైతులు పంటలు సాగు చేస్తున్నారు. పంపింగ్ స్కీమ్ కింద తాడేపల్లి కుంచనపల్లి, ప్రాతూరు, రామచంద్రాపురం తదితర గ్రామాలు ఉన్నాయి. గతంలో పంపింగ్ స్కీమ్ కింద పంటలు ఎప్పుడూ కళకళలాడుతూ కనిపించేవి. రానురాను పంపింగ్ స్కీమ్ పంట కాలువల వద్ద అపార్టుమెంట్లు వెలవడం, అపార్టుమెంట్ల నుంచి వచ్చే వ్యర్థాలన్నీ ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కాలువలోకి ఆయా ప్రాంతవాసులు వదులుతుండడంతో పంట కాలువ మొత్తం వ్యర్థాలతో నిండిపోతోంది. దీంతో వ్యర్థాలతో నిండిన నీటివల్ల పంట భూములు చౌడుబారి సారం తగ్గి దిగుబడి పూర్తిగా తగ్గిపోతోంది. అంతేకాకుండా పశువులు కూడా చర్మరోగాల బారిన పడుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవడమే కాక పలువురు సాగును సైతం మాని వేశారు. పైగా ఖరీఫ్ సీజన్ నాటికి కూడా పంట కాలువలు బాగు చేయకపోవడం, నీరుపోయే మార్గం లేకుండా వ్యర్థాలతో నిండిపోయి ఉండడంతో ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కింద సాగుసైతం ప్రశ్నార్థకంగా మారింది. అన్నదాత రైతన్నకు పంపింగ్ స్కీమ్ లాభదాయకం కాకుండా నష్టదాయకంగా మారిందని రైతులే



ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ భవనం

వ్యాఖ్యానిస్తున్నారు. ఆయా అపార్టుమెంట్ల నుంచి వచ్చే వ్యర్థాలన్నీ పంపింగ్ స్కీమ్ కాలువలో పేరుకుపోతున్నా అటు ఎంటీఎంసీ అధికారులు గానీ ఇటు సంబంధిత అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. రైతు సంఘం నేతలు, స్థానిక రైతులు ధర్నాలు చేసి, ఉన్నతాధికా రులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. అధికారులు మొక్కుబడిగా వచ్చి చూసి వేసి అలా చేద్దాం.. ఇలా చేద్దామంటూ... ప్రణాళికలు రూపొందిద్దామంటూ చెప్పి వెళ్లిపోవడమే తప్ప పనులు జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమస్య కొన సాగితే మరికొన్ని రోజులకు ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కింద సాగు పూర్తిగా ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి కనిపిస్తోంది.

రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం

• జొన్నా శివశంకర్



ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌లో కలుస్తున్న వ్యర్థాలను నియంత్రించాలని ఏనాటి నుంచో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం తరఫున విజ్ఞప్తులు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదు. మొక్కుబడిగా వచ్చి షో చేసి చూసి వెళ్లడం తప్ప సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి వ్యర్థాలను శుద్ధి చేసి బకింగ్ హామ్ కెనాల్‌లోకి ఆ నీటిని మళ్లిస్తే సమస్యకు కొంత మేరైనా పరిష్కారం లభిస్తుంది.

ఫ్యాక్టరీ ప్రీమియం లీగ్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న జంగాల వెంకటేష్, వెంకట్రావు

తాడేపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి 8వ వార్డులోని బ్రహ్మానందపురంలో 15 రోజులుగా జరుగుతున్న ఫ్యాక్టరీ ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో గెలుపొంది ప్రథమ స్థానం సాధించిన జట్టుకు రూ.లక్ష, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.25వేలు గుంటూరు పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్ సహకారంతో నగదు బహుమతులు అందజేశారు. లీగ్‌లో మొత్తం 50 జట్లు పాల్గొన్నాయి. బీఎస్ఆర్ 11 వర్సెస్ రెడ్ చిల్లీస్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బీఎస్ఆర్ 11 జట్టు విజేతగా నిలిచింది. బిఎస్సార్ 11 జట్టుకు రూ.లక్ష బహుమతిని మంత్రి నారా లోకేశ్ సహకారంతో డీఎస్పీ శాంతిరాజు, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ద్వితీయ బహుమతి సాధించిన రెడ్ చిల్లీస్ జట్టుకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు రూ.50వేల నగదు బహుమతి అందజేశారు. తృతీయ బహుమతి సాధించిన వల్లభనేని వెంకట్రావు జట్టుకు జంగాల వెంకటేష్ సహకారంతో రూ.25వేల నగదు స్థానిక నేతలు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా గెలిచిన కొర్రపాటి అశోక్‌కు రూ.10వేలు దాసరి ఉదయశంకర్, బెస్ట్ బ్యాట్స్‌మన్ కొర్రపాటి అశోక్‌కు రూ.5వేలు దామర్ల ధనలక్ష్మి, బెస్ట్ బౌలర్‌గా నిలిచిన ప్రశాంత్‌కు రూ.5వేలు దావీదు సహకారంతో నగదు బహుమతులు అందజేశారు. విజేతలకు ట్రోఫీలను కొర్రపాటి విజయ్ సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శాంతిరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో యువతకు క్రీడాపోటీలు నిర్వహిస్తూ వారిని చైతన్య పరుస్తూ మంత్రి లోకేశ్ ఎంతో గుర్తింపు తెస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, తాడేపల్లి ఎస్‌ఐ ఖాజావలి, నేతలు జంగాల వెంకటేష్, దారా దాసు, కొర్రపాటి విజయ్, శివప్రసాద్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి కర్రసాము పోటీలు

• ఛాంపియన్‌గా అమలాపురం క్రీడాకారిణి జ్యోత్స్న



కర్రసాము విజేత జ్యోత్స్నకు షీల్డు అందజేస్తున్న నిర్వాహకులు

పెదనందిపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో కర్రసాము నేషనల్ కోచ్ చెవుల రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివలస రాష్ట్రస్థాయి సంప్రదాయ కర్రసాము పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. ఆయా జిల్లాల నుంచి క్రీడాకారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీలను విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య ప్రారంభించి మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను గ్రామీణ స్థాయిలో పోటీలను నిర్వహించి ప్రాచీనంలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. జూనియర్స్ విభాగం ఫైట్ పోటీలో జగదీష్‌కుమార్, సాయి మణికంఠ, రాకేష్‌లు, సబ్ జూనియర్స్ విభాగంలో లోకేష్, గిరివెంకటదుర్గాసాయి, టీ రాజు, పులి మహేందర్‌రెడ్డి, సీనియర్స్ విభాగంలో మోక్షిత్ రామకృష్ణ, నాగసాయి, రూపేష్‌లు, మహిళా జూనియర్స్ విభాగంలో రాయుడు జ్యోత్స్న, మనస్వినిసాయి, గీతిక శ్రీలు, సీనియర్స్ విభాగంలో దేవికరాణిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి బంగారు, వెండి, కంచు పతకాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈపోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా అమలాపురం జిల్లా అంబాజీపేటకు చెందిన రాయుడు జ్యోత్స్న కత్తి, కర్ర, ఫైట్ విభాగాల్లో ప్రతిభ కనబర్చడంతో నాలుగు బంగారు, ఒక సిల్వర్ పతకం సాధించింది. పోటీలకు న్యాయనిర్ణేతలుగా బీ గణేష్, కే రాంబాబు, ఎం రమ్య, ఎన్ హేమమానసలీల, డీ నవీన్‌కుమార్, పీ మణికంఠలు వ్యవహరించారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ సత్యం, దివ్వి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహారలో విద్యా భారతి సమావేశాలు



ప్రధానోపాధ్యాయులను సత్కరించిన విద్యాభారతి ప్రతినిధులు

మంగళగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి వర్షారంభ సమావేశాలు నూతక్కి గ్రామంలోని విజ్ఞాన విహార పాఠశాలలో శని, ఆదివారాల్లో జరిగాయి. తొలిరోజు విద్యాభారతి ప్రాంత అధ్యక్షుడు ఆచార్య జీ నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర ఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, ఏపీ కార్యదర్శి జే ప్రతాప సింహ శాస్త్రి, కార్యదర్శి కన్నా భాస్కర్, ఉపాధ్యక్షుడు వెలగపూడి రామకృష్ణ హాజరయ్యారు. రెండో రోజు విద్యాభారతి ఏపీకి అనుబంధంగా ఉన్న ఉన్నత పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. వారి తోపాటు పదో తరగతిలో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. జీవీఎస్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డి.ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ రెండు రోజుల సమావేశాల్లో రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించిన వార్షిక యోజన, పాఠశాలల్లో ఉన్నత విద్యా ప్రమాణాల పెంపు కోసం చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. మరిన్ని ఉన్నత ఫలితాలు సాధించాలని, పాఠశాలలను సామాజిక చైతన్య కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు.

29న రత్నాలచెరువులో ఉచిత వైద్య శిబిరం

మంగళగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని రత్నాలచెరువులో ఈ నెల 29వ తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్ తెలిపారు. ప్రజారోగ్య వేదిక మంగళగిరి రీజియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు. పేదలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, జూలై ఒకటో తేదీన డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించాలని, పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

పొగాకు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

గుంటూరు(తూర్పు), జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న ప్రత్తిపాడు మండలం, పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన పొగాకు కౌలు రైతు కావూరి శివశంకర వరప్రసాద్ కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. జీజీహెచ్ శవాగారంలో భద్రపరిచిన శివప్రసాదు మృతదేహాన్ని వారు సందర్శించి కుటుంబసభ్యులుతో మాట్లాడారు. మృతుడి కుటుంబానికి రూ.10 లక్షలు, సొంతిల్లు, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై నేతాజీ, రైతు సంఘాల నాయకులు బీ రామకృష్ణ, కే నాగమల్లేశ్వరరావు, పాశం రామారావు తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ అవార్డులకు ఆరుగురి ఎంపిక

పెదనందిపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో గతేడాది పది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈవో ముద్దన శ్రీనివాసరావు తెలిపారు. నంది పాఠశాలకు చెందిన ఎన్ స్నేహిత, శ్రీవిద్య, గోగులమూడి జడ్పీ పాఠశాలకు చెందిన పఠాన్ జాయ్‌ఆఫ్రీన్, ఏబీపాలెం సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన తోకల యేసురాజా, శ్రీనివాసా పాఠశాలకు చెందిన టి శ్యావ్యశ్రీ, ఏ నిషితాచరణ్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు సోమవారం గుంటూరులో అవార్డులు అందుకోనున్నట్లు తెలిపారు.

కాకుమాను విద్యార్థుల ఎంపిక

కాకుమాను, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతిభా అవార్డులకు కాకుమాను విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో కేఎఫ్ కెన్నడీ ఆదివారం తెలిపారు. కాకుమాను జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు షేక్ అస్మా, తమ్మా రిషిత, కన్నెగంటి లికిన్ మణికంఠ చౌదరి, కనకమేడల తేజశ్రీ స్థానిక ఇండియన్ జెమ్స్ పాఠశాల విద్యార్థులు, కర్లపూడి భావన, స్థానిక అంబేడ్కర్ గురుకుల(బాలికల) పాఠశాల విద్యార్థిని కాగా, మానికల కీర్తన రేటూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని. ఈ అవార్డులకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో, పలు ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు అభినందించారు.

పేద విద్యార్థికి అండగా స్ఫూర్తి ఫౌండేషన్



పేద విద్యార్థికి చెక్కు ద్వారా సాయం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి శివప్రసాద్

మేడికొండూరు జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ, కుల మతాలకతీతంగా చదువుకోవాలనే కాంక్ష కలిగిన పేద విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ అండదండలు అందిస్తోంది. అందులో భాగంగా పేద కళాకారుల కుటుంబాలకు చెందిన మిరియాల బాలాజీ వెంకటేష్ అనే విద్యార్థికి 9వ తరగతికి అయ్యే ఖర్చుల నిమిత్తం రూ.34 వేల చెక్కును ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ మేడికొండూరు మండలం, సిరిపురంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ గుంటూరు నగరానికి చెందిన మిరియాల శివప్రసాద్ జానపద కళాకారుడు. మూడేళ్ల క్రితం కరోనా కారణంగా కళాకారులకు పనుల్లేక పూటగడవని పరిస్థితిలో ఆరో తరగతి చదువుతున్న ఆయన కుమారుడు బాలాజీ వెంకటేష్ స్ఫూర్తి ఫౌండేషన్ గురించి తెలుసుకొని తనకు సాయం చేయాలని అర్థించాడు. స్ఫూర్తి ఫౌండేషన్ బాలుడి వివరాలు, కుటుంబ పరిస్థితులు తెలుసుకొని ఆ ఏడాది రూ.20వేలను అందించిందని, అప్పటి నుంచి విద్యార్థి చదువుకు అవసరమైన సాయాన్ని ప్రతిఏటా అందిస్తూ వస్తున్నామని తెలిపారు. సహకారం అందిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీవ్యాల్, శిరీష తదితరులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మిద్దె సెంటర్లో మొక్కల పంపిణీ

మంగళగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం-పర్యావరణ పరిరక్షణ బృందం ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి మిద్దె సెంటర్లో ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య మాట్లాడుతూ ప్రస్తుతం మన రాష్ట్రంలో 30.5 శాతం పచ్చదనం మాత్రమే వుందని, రాబోయే 2047 నాటికి 50 శాతానికి పెంచాలని ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. ప్రభుత్వ సంకల్పానికి ప్రజలందరూ చేయూతనిచ్చేందుకు విరివిగా మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ బృందం ప్రతినిధులు తప్పెట్ల ఆంజనేయులు, అప్పలనాయుడు, కే చిరంజీవి, కోటేశ్వరరావు, వసుమతిదేవి, శేషాచలం పాల్గొన్నారు.

కృష్ణంరాజు, కొమ్మినేనిపై కేసు నమోదు

తుళ్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని మహిళలను కించపరిచే విధంగా జగన్‌మీడియాలో మాట్లాడిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్‌పై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంబంపాటి శిరీష ఆదివారం తుళ్లూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు చల్లావారిపాలెంలో వాటర్‌ట్యాంక్ ప్రారంభం

మేడికొండూరు జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం చల్లావారిపాలెంలో నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ను స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సోమవారం ప్రారంభించనున్నట్లు స్థానిక కూటమి నేతలు ఆదివారం తెలిపారు. వాటర్ ట్యాంక్‌తో పాటు తాజాగా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించనున్నారు. అంతేగాకుండా నిర్మించనున్న సీసీ రోడ్లకు, వంతెనలకు ఆయన శంకుస్థాపన చేయనున్నారని వారు వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొంటారని తెలిపారు.

భారీ ర్యాలీని విజయవంతం చేయాలి

• ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చి ఈనెల 12కి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నియోజక వర్గంలో చేపట్టిన భారీ ర్యాలీ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో తాడికొండ మండల ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు నియోజకవర్గంలో చేపట్టబోయే భారీ ర్యాలీకి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. వైసీపీ అమరావతిపై చేస్తున్న విషప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. సంవత్సరం నుంచి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. తాడికొండ మండలంలోని గ్రామాలను త్వరలోనే సందర్శించి రైతులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. తాడికొండ మండలంలో భూములు ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చే విధంగా ఆయా గ్రామాల్లోని నాయకులు రైతులతో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, టీడీపీ కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరాయ్య, టీడీపీ సీనియర్ నాయకులు ఎడ్లూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మీడియా నిందితులపై చర్యలు తీసుకోవాలి

• నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో తెలుగుమహిళా నేతల ఫిర్యాదు



సౌత్ డీఎస్పీ భానోదయకు ఫిర్యాదు చేస్తున్న తెలుగుమహిళా నేతలు

గుంటూరు. జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని మహిళలపై దారుణంగా మాట్లాడిన జగన్ మీడియా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళా నేతలు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలుగుమహిళా నాయకురాలు, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకులు భీమినేని వందనాదేవి మాట్లాడుతూ సాక్షి టీవీ ద్వారా రాజధాని అమరావతిపై, రాజధాని పరిసర ప్రాంతాల్లో ఉండే మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నల్లపాడుస్టేషన్‌లో ఉన్న సౌత్ డీఎస్పీ భానోదయకు వారు ఫిర్యాదు అందించారు. అనంతరం నల్లపాడు పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ స్మితా పద్మజ, ప్రత్తిపాడు మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ ఉమా, తెలుగుమహిళా నేతలు లక్ష్మీ గణేష్, సుశీల, తులసి, మేరీ, జయమ్మ, శివమ్మ, నర్మదా, రాములమ్మ, శివజ్యోతి, 41వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బుర్రి సురేష్, ఐటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచుమర్తి శేషుతో పాటు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

కృష్ణంరాజు, కొమ్మినేనిపై చర్యలు తీసుకోవాలి

తాడేపల్లి(పెనుమాక), జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమరావతిని వేశ్యలరాజధానిగా ఆరోపిస్తూ జర్నలిస్టు కృష్ణంరాజు మాట్లాడిన మాటలు దుర్మార్గమని లైవ్ డిబేట్ నిర్వహించిన కొమ్మినేనిని వెంటనే అరెస్టు చేయాలని అమరావతి రాజధాని జేఏసీ సమన్వయ కమిటీ సభ్యుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేస్తూ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశాడు. సాక్షి లైవ్ ఛానల్ డిబేట్ నిర్వహించిన కొమ్మినేని, వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజుపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మీడియా యాజమాన్యం సైతం బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు.

• తాడేపల్లి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జగన్ టీమ్ సభ్యులు సాక్షి ఛానల్‌లో పని చేస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు, విశ్లేషకుని ముసుగులో ఉన్న వైసీపీ పెయిడ్ ఆర్టిస్టు కృష్ణంరాజును తక్షణమే అరెస్టు చేసి రాష్ట్ర బహిష్కరణ చేయాలని కాపు సంఘం నేత తోట సాంబశివరావు డిమాండ్ చేశారు.

వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న పుల్లడిగుంట, కోవెలమూడి వాసులు

వట్టిచెరుకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను అరెస్టు చేయాలని వట్టిచెరుకూరు పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఛానల్ యాజమా న్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో పుల్లడిగుంటకు చెందిన మన్నవ శ్రీనివాసరావు, కోవెలమూడికి చెందిన ఐనంపూడి అమ్మాజీ, ముద్రబోయిన లక్ష్మి, టీ సదాశివరావులు ఉన్నారు.

వీరాంజనేయ స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలి

• నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు



శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

ఫిరంగిపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని వీరాంజనేయ స్వామి దేవాలయంలో నరసరావుపేట చదలవాడ అరవిందబాబు ఆదివారం స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పూజారులు, గ్రామ పెద్దలు, ఆలయ పెద్ద సీతారామాంజనేయులు, గుడి పెద్దలు పాల్గొన్నారు.